శనివారం
16-09-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 87
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కాంగ్రెస్ ఎన్నికల వ్యూహం

నేడు హైదరాబాద్‌లో పునర్నిర్మిత సీడబ్ల్యూసీ తొలి భేటీ

ఐదు రాష్ట్రాలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలకు వ్యూహాన్ని రూపొందించేందుకు పునర్నిర్మించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) మొదటి సమావేశం శనివారం ఇక్కడ జరగనుంది.

2 లో

21 నుంచి అసెంబ్లీ

ఏర్పాట్లపై మంత్రి బుగ్గన సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు అసెంబ్లీ వ్యవహారాల శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. సమావేశాల ఏర్పాట్లపై అసెంబ్లీలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుంచి శాసనసభ ఉదయం 9గంటలకు, శాసన మండలి సమావేశాలు 10గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ నేపథ్యంలో సమావేశాల నిర్వహణకు సంబంధించిన అంశాలు, భద్రత, వసతుల ఏర్పాట్లు, తదితర విషయాలపై చీఫ్ విప్ , విప్‌లతో చర్చించామన్నారు. అదే రోజు శాసనసభ వ్యవహారాల కమిటీ సమావేశం, ఎన్ని రోజులు నిర్వహించాలి, ఏ ఏ అంశాలపై చర్చ జరగాలనే అంశాలపై నిర్ణయం జరుగుతుందన్నారు. శాసనసభ సమావేశాల హుందాతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడుకుంటూ ప్రతి అంశంపై సమగ్రంగా చర్చిస్తామన్నారు. గతంలో లాగానే ఈ సమావేశాలకు అధికార యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని మంత్రి బుగ్గన ఆదేశించారు. ఈ సమీక్షలో చీఫ్ విప్ ముదునూరి నాగరాజ వర ప్రసాద రాజు, విప్‌లు జంగా కృష్ణమూర్తి, కాపు రామచంద్రారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కాలేజీలపై ఖాకీ కన్ను

- బలవంతంగా మూసివేత
- బాబు అరెస్టుతో ముందు జాగ్రత్త చర్యలు
- విద్యార్థుల మండిపాటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఆందోళనలు జరగకుండా చేయడానికి పోలీసులు నానాతంటాలు పడుతున్నారు. చంద్రబాబుకు మద్దతుగా యువత నిరసనలు, ఆందోళనకు దిగుతారనే సమాచారంతో ముందుగానే హడావుడీ చేస్తూ...విమర్శలకు గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టు కావడంతో రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ నిరసనలకు దిగింది. బాబుతో మేము' పేరుతో దీక్షలు చేపట్టింది. అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర బంద్ నిర్వహించిన విషయం విదితమే. తర్వాత నిరాహారదీక్షలు కొనసాగిస్తోంది. దీంతో పోలీసులు అప్రమత్తమై టీడీపీ ఆందోళనలపై ఉక్కుపాదం మోపడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులు ఉద్యమాలకు రాకుండా చేయడంపై దృష్టి కేంద్రీకరించారు. అందులో భాగంగా కాలేజీలను మూయిస్తున్నారు. విజయవాడలోని వీఆర్ సిద్దార్థ ఇంజినీరింగ్, పీవీపీ ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లిన పోలీసులు తరగతులు నిలిపివేయించారు. కళాశాలలకు సెలవులు ఇవ్వాలని యాజమాన్యంపై ఒత్తిడి చేశారు. కాలేజీలు మూయించి...విద్యార్థులను బయటకు పంపారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా ఆందోళనలు చేయాలని వాట్సాప్ సందేశాలు బహిర్గతం కావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేశారు. చదువు కోసం విద్యార్థులు కళాశాలలకు వెళ్తే, వారిని బలవంతంగా బయటకు పంపడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఐటీ ఉద్యోగుల తరహాలో...

చంద్రబాబు అరెస్టును వ్యతిరేకిస్తూ హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు రోడ్డెక్కడం చర్చనీయాంశమైంది. అదే బాటలో బెంగళూరులోనూ ఐటీ ఉద్యోగులు నిరసన చేపట్టారు. విజయవాడలోని కొన్ని కళాశాలల విద్యార్థులు ఆందోళనలకు సిద్ధమవ్వగా పోలీసులు అదుపు చేశారు. కళాశాలల పరిసర ప్రాంతాల్లో భారీ పోలీసు బలగాలను రంగంలోకి దించారు. కళాశాలల ప్రధాన మార్గాల్లో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయి. ఆయా పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత

- మిగతా 2 లో

చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై
విచారణ వాయిదా

కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీకి ఆదేశం



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన మధ్యంతర బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. విచారణను ఈ నెల 19కి వాయిదా వాస్తూ విజయవాడ అనిశా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈలోగా కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నిధుల వినియోగంలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలో సీఐడీ తనపై నమోదు చేసిన కేసులో బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ టీడీపీ అధినేత చంద్రబాబు గురువారం ఏసీబీ కోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఈ కేసులో తన పాత్రపై కనీసం ప్రాథమిక ఆధారాలు లేకపోయినా సీఐడీ కేసు నమోదు చేసిందని పిటీషన్‌లో పేర్కొన్నారు. "ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ ఇచ్చిన ఫిర్యాదులో నా పేరు లేదు. కేసులో నా పేరు ఎప్పుడు చేర్చారో కనీసం చెప్పలేదు. ఏ ఆధారాలతో నన్ను నిందితుడిగా చేర్చారో చెప్పేందుకు సీఐడీ వద్ద ప్రాథమిక ఆధారాల్లేవు. రాజకీయ ప్రతీకారంతో దురుద్దేశపూర్వకంగా నన్ను ఈ కేసులోకి లాగారు. ముఖ్యమంత్రి ప్రోద్బలంతో నన్ను ఇరికించారు. ఈ అంశాల్ని పరిగణనలోకి తీసుకుని బెయిల్ మంజూరు చేయండి. ప్రధాన వ్యాజ్యాన్ని తేల్చేలోపు మధ్యంతర బెయిల్ ఇవ్వండి" అని పిటీషన్‌లో కోరారు. దీనిపై శుక్రవారం ఏసీబీ కోర్టు న్యాయమూర్తి విచారణ చేపట్టగా, బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినాలని చంద్రబాబు తరపు న్యాయవాది కోర్టును కోరారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్ పెండింగ్‌లో ఉండటాన్ని న్యాయమూర్తి ప్రస్తావిస్తూ, మధ్యంతర బెయిల్‌పై విచారిస్తే క్వాష్ పిటీషన్‌పై ప్రభావం పడుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై కౌంటరు దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించగా, సమయం కావాలని కోరారు. దీంతో తదుపరి విచారణను 19వ తేదీకి వాయిదా వేశారు.

తేరుకోని లిబియా

దేనియల్ తుపాను మిగిల్చిన విషాదం నుంచి లిబియా ఇంకా తేరుకోలేదు. వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన డెర్నా నగరంలో పరిస్థితి కుదుటపడలేదు. డ్యామ్‌ల నుంచి దూసుకొచ్చిన నీటిలో కొట్టుకుపోయి జలసమాధి అయిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

2 లో

విచ్ఛిన్నకర మోదీ

- రాజ్యాంగ విరుద్ధ చర్యలు
- సమాఖ్య స్ఫూర్తికి తూట్లు
- 'ఒకే దేశం' మాటలు... లోపల విభజన కుట్రలు
- ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ వివక్ష

నరేంద్ర మోదీ... నిరంకుశ, ఏకపక్ష, మతోన్మాద వైఖరికి నిలువెత్తు నిదర్శనం. భారతదేశ రాజ్యాంగం, తమ దేశ సంస్కృతి గొప్పదని ప్రపంచ దేశాల వద్ద ప్రగల్భాలు పలికే ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ బీజేపీ నాయకుడు... మొత్తంగా దేశానికి ప్రధాన మంత్రి. అయితే ఆయన చర్యలన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవే. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడిచివే. ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించేవే. ప్రజల హక్కులను కాలరాచేవే అన్నది నిస్సందేహం. కేంద్రంలో మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల పట్ల అత్యంత వివక్షతను ప్రదర్శిస్తోంది. ఆయా రాష్ట్రాలకు అభివృద్ధి నిధుల విడుదలలో అలసత్వం చూపుతోంది. ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిందేమిటంటే, దేశ ప్రగతికి చోదక శక్తిగా మారిన దక్షిణాది రాష్ట్రాలపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందని ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. అయినా మోదీ ఏకపక్ష వైఖరినే కొనసాగిస్తున్నాడు. భాషా, సంస్కృతులను విచ్ఛిన్నం చేసేలా వ్యవహరిస్తున్నాడు.

2 లో

కేరళను కలవరపెడుతున్న నిఫా

అప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

అక్కడే ఎందుకనేది తెలియదు: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ: నిఫా వైరస్ వ్యాప్తి కేరళను మరోసారి కలవరపెడుతోంది. ఇప్పటికే ఈ వైరస్ బారిన పడి ఇద్దరు మృతి చెందారు. ఈ కేసులు పెరుగుతుండటంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. నిపా వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) తెలిపింది. 'నిఫా' సోకిన వారు మరణించే అవకాశాలు చాలా ఎక్కువని మృత్యుశాతం 40-70 శాతం మధ్య ఉంటుందని పేర్కొంది. ప్రపంచాన్ని వణికించిన కొవిడ్ విషయంలో ఇది కేవలం 2- 3 శాతం మాత్రమేనని ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ భల్ చెప్పారు. కేరళలో ప్రస్తుతం ఈ వైరస్ సోకిన వ్యక్తులందరూ మొదట వ్యాధి సోకిన రోగితో పరిచయం కలిగి ఉన్నవారేనని తెలిపారు. స్థానికంగా నిఫా వ్యాప్తి కట్టడికి ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు చెప్పారు. అయితే, కేరళలోనే నిఫా కేసులు తరచూ ఎందుకు వెలుగుచూస్తున్నాయనే దానిపై స్పందిస్తూ 'ఈ విషయం మాకూ తెలియదు. 2018లో వ్యాప్తి చెందినప్పుడు గబ్బిలాలతో సంబంధం ఉన్నట్లు కనుగొన్నాం. అయితే గబ్బిలాల నుంచి మనుషులకు ఇన్‌ఫెక్షన్ ఎలా సంక్రమిస్తుందో కచ్చితంగా తెలియదు. దీన్ని తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇది ప్రతిసారి వర్షాకాలంలోనే జరుగుతోంది' అని వివరించారు. 'నిఫా విషయంలో ఐసీఎంఆర్ వద్ద ప్రస్తుతానికి 10 మంది రోగులకు సరిపడా మాత్రమే మోనోక్లోనల్ యాంటీబాడీ డోసులు ఉన్నాయి. 2018లో ఆస్ట్రేలియా నుంచి వాటిని తెప్పించాం. ఇప్పుడు మరో 20 డోసులు సేకరించనున్నాం. ఇన్ఫెక్షన్ ప్రారంభ దశలో ఈ ఔషధం ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, దేశంలో ఇప్పటివరకు ఎవరికీ ఈ యాంటీబాడీ డోసు ఇవ్వలేదు. భారత్ వెలుపల 14 మంది నిఫా రోగులకు ఈ యాంటీబాడీలు అందించారు. వారంతా కోలుకున్నారు' అని భల్ చెప్పారు. యాంటీబాడీ డోసు భద్రత విషయంలో కేవలం ఫేజ్- 1 ట్రయల్ మాత్రమే పూర్తయిందని తెలిపారు. అదీ విదేశాల్లోనే పూర్తయిందని చెప్పారు. దాని సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో పరీక్షించాల్సి ఉందన్నారు. కేరళలో ఈ యాంటీబాడీ డోసును ఉపయోగించే విషయంలో వైద్యులు, రోగుల కుటుంబీకులతోపాటు స్థానిక ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని చెప్పారు.

కేరళలో మరో నిపా కేసు

కాగా కేరళలోని కోజికోడ్ జిల్లాలో శుక్రవారం నిపా వైరస్ సోకిన మరో కేసు

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గోడు చెప్పబోతే... గొంతు నొక్కేశారు

- అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్షను అడ్డుకున్న పోలీసులు
- డిమాండ్లు నెరవేర్చే దాకా ఉద్యమాలు
- నాయకుల స్పష్టీకరణ

విశాలాంధ్ర-విజయవాడ: నిత్యం రద్దీగా ఉండే విజయవాడ రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద పోలీసు పికెటింగులు... ప్రయాణికులపై అనుమానపు చూపులు... నగరానికి వచ్చే వారిపై నిఘా... అక్కడక్కడా బారికేడ్ల ఏర్పాటు... సాధారణ ప్రయాణికులకు ఏమి జరుగుతుందోననే భయం... చంద్రబాబు అరెస్టు, టీడీపీ నాయకుల ఆందోళనలతో రాష్ట్రంలో ఆందోళనకర పరిస్థితులు... బిక్కుబిక్కుమంటూ విధులకు హాజరవుతున్న ఉద్యోగులు...చూస్తుండగానే తమతో పాటు వస్తున్న ఇద్దరిని పట్టుకెళ్లి పోలీస్‌వ్యాన్‌లో ఎక్కిస్తున్న పోలీసులు...హడలిపోయిన ప్రయాణికులు.... అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం పిలుపుతో శుక్రవారం విజయవాడలో చోటుచేసుకున్న పరిస్థితి ఇది. తాము అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ శుక్రవారం చేపట్టిన చలో విజయవాడ శంఖారావ దీక్షను ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది. గురువారం రాత్రి నుంచే రాష్ట్రవ్యాప్తంగా అసోసియేషన్ నాయకుల గృహనిర్బంధం, అక్రమ అరెస్టులతో పోలీసులు ఉద్యమాన్ని అడ్డుకున్నారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావుకు

- మిగతా 2 లో

అధ్వాన రోడ్లు...
జనం అవస్థలు

- అల్లూరి జిల్లాలో నాసిరకంగా రహదారుల నిర్మాణం
- కొద్దిపాటి వర్షాలకి కొట్టుకుపోతున్న వైనం

విశాలాంధ్ర-జి.మాడుగుల: అల్లూరి జిల్లాలో రహదారుల నిర్మాణం దారుణంగా తయారైంది. అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్లు నాసిరకంగా నిర్మిస్తున్న రహదారులు కొద్దిపాటి వర్షాలకే ఛిద్రమవుతూ గోతులమయంగా మారుతున్నాయి. నిత్యం అనేకమంది గుంతల రోడ్లపై ప్రమాదాలకు గురవుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం పాలమామిడి

- మిగతా 2 లో

తేరుకోని లిబియా

భీతావహంగా డెర్నా నగరం

తుపాను సృష్టించిన మహా విలయంలో 20వేల మంది మృతి

డెర్నా: డేనియల్ తుపాను మిగిల్చిన విషాదం నుంచి లిబియా ఇంకా తేరుకోలేదు. వేలాది మంది ప్రాణాలు కోల్పో యిన డెర్నా నగరంలో పరిస్థితి కుదుటపడలేదు. డ్యామ్‌ల నుంచి దూసుకొచ్చిన నీటిలో కొట్టుకుపోయి జలసమాధి అయిన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. డెర్నాలో కేవలం ఒక్కే ఒక్క రాకాసి అల... 20 వేల మంది ప్రాణాలను బలిగొందని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ నిపుణులు వెల్లడించారు. ఈ అల ఎత్తు దాదాపు 7 మీటర్లు ఉందని తెలిపారు. పల్లపు ప్రాంతాల్లో ఈ అల ఎత్తు దాదాపు ఆరు అంతస్తుల భవనం అంత ఎత్తుకు చేరుకొందని... అందువల్లే మరణాల సంఖ్య భారీగా ఉందని అంతర్జాతీయ రెడ్ క్రాస్ కమిటీ నిపుణులు వివరించారు. అత్యం త వేగంతో దూసుకొచ్చిన బురద నీరు... భారీ భవనాలను కుప్పకూల్చి... ప్రజలను ఈడ్చుకొని సముద్రంలోకి తీసుకెళ్లిపోయిం దని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన జరిగి రోజులు గడుస్తున్నా ఇప్పటికీ అక్కడి సముద్ర తీరంలో తేలియాడుతున్న మృతదేహాలు స్థానికులకు కనిపిస్తూనే ఉండడం డెర్నాలో దుస్థితికి అద్దం పడుతోంది. డెర్నాలో వేలాది మంది జాడ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. వరద ఉధృతికి ఇళ్లు సహా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన వారు వేల సంఖ్యలో ఉన్నారని వెల్లడించారు. సహాయక చర్యలు ప్రారంభించిన బృందాలకు ఎక్కడ చూసినా కుళ్లినల్లి స్థితిలో మానవ మృతదేహాలు కనిపిస్తున్నాయి. కనీస వసతులు కూడా లేని డెర్నాలోని ఆస్పత్రులు మృతదేహాలకు నిలయాలుగా మారాయి. మృతుల సంఖ్య 20 వేలకు పైనే ఉంటుందని డెర్నా మేయర్ అబ్దుల్ మునీమ్-అల్-ఘైతీ చెప్పారు. ఇప్పటికే వేల సంఖ్యలో మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. డెర్నా నగరంలో తుపాను తర్వాత పరిస్థితు లు... నాటి విధ్వం సానికి గుర్తులుగా మారాయి. పదుల సంఖ్యలో కార్లు, వాహనాలు కొట్టుకువచ్చి ఒక దగ్గర్గ చెల్లాచెదురుగా పడిపోయాయి. కూలిపోయిన భవనాలు...నేలకూలిన భారీ వృక్షాలు... వరదల్లో సర్వస్వం కోల్పో యిన బాధితుల రోదనలో.. డెర్నా భీతావాహంగా మారింది. డెర్నాలో డేనియల్ తుపాను విధ్వంసంలో కుటుంబాలకు కుటుంబాలే గల్లంతయ్యాయని అధికారులు తెలిపారు. ముందస్తు హెచ్చరికలు లేకపోవడం వల్లే మరణాల సంఖ్య పెరిగిందని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది.

ఐఫోన్-12కు సరికొత్త సాఫ్ట్‌వేర్: యాపిల్

శాన్ ఫ్రాన్సిస్కో: రేడియేషన్ కారణంగా ఫ్రాన్స్‌లో ఐఫోన్12 అమ్మకాలపై నిషేధం విధించిన క్రమంలో దీనిపై యాపిల్ సంస్థ తాజాగా స్పందించింది. రేడియేషన్ సమస్యను తీర్చేందుకు ఐఫోన్ 12 మొబైల్ ఫోన్ల కోసం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయనున్నట్లు యాపిల్ సంస్థ ప్రకటించింది. దీంతో ఫ్రాన్స్‌లో అమ్మకాలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయనున్నట్లు ఆ సంస్థ చెప్పింది. యురోపియన్ యూనియన్ నిబంధనల కన్నా అధిక స్థాయిలో ఐఫోన్ 12 నుంచి రేడియేషన్ వస్తున్నట్లు ఫ్రాన్స్ ఆందోళన వ్యక్తం చేసింది. కాగా ఫ్రాన్స్ రెగ్యులేటరీ సంస్థలకు లోబడే ఆ దేశ వినియోగదారుల కోసం సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేయనున్నట్లు యాపిల్ సంస్థ తన ప్రకటనలో పేర్కొంది.

డెట్రాయిట్‌లో 13వేల మంది కార్మికుల సమ్మె

వేతనాలు పెంచాలని డిమాండ్

వాషింగ్టన్ : వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ 13వేలమంది కార్మికులు ఒకేసారి సమ్మెకు దిగారు. డెట్రాయిట్‌లోని మూడు వాహన తయారీ కంపెనీలకు చెందిన 13,000 మంది కార్మికులు శుక్రవారం సమ్మె ప్రారంభించారు. కార్మికుల డిమాండ్లపై సదరు సంస్థలతో యునైటెడ్ ఆటోవర్కర్స్ యూనియన్ నేతలు జరిపిన చర్చలు విఫలమయ్యాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. నాలుగేళ్ల ఒప్పందం గురువారంతో ముగియడంతో మూడు కంపెనీలకు చెందిన యూనియన్ సభ్యులు ఏకకాలంలో చర్చల నుంచి వాకౌట్ చేయడం అమెరికా 88 ఏళ్ల చరిత్రలో ఇదే మొదటి సారి. మిస్సౌరిలోని వింట్జ్‌విల్లె నగరంలోని మోటర్స్ ప్లాంట్, మిచిగాన్ లోని ఫోర్డ్ ఫ్యాక్టరీ, ఒహియోలోని స్టెల్లాంటిస్ జీప్ ప్లాంట్ వద్ద కార్మికులు పికెటింగ్ ప్రారంభించారు. 60 యూనియన్ సమాఖ్య అయిన ఏఎఫ్ఎల్-సీఐఓ అధ్యక్షుడు లిజ్ మాట్లాడుతూ... ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికులు ఈ సమ్మెను పరిశీలిస్తున్నారు. నాలుగేళ్లలో 36 శాతం కన్నా వేతనాల పెంపుదల తక్కువగా ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీవన వ్యయం భారీగా పెరిగిపోతున్నా... వాటికి అనుగుణంగా వేతనాలు పెరగడం లేదని చెబుతున్నారు. 401కె తరహా పదవీవిరమణ పథకాలు, పదవీ విరమణ చేసినవారికి పెన్షన్ల పెంపుదలను డిమాండ్ చేస్తున్నారు.

మెక్సికో పార్లమెంటులో ఏలియన్ శకలాలు!

లోతైన పరిశీలన అవసరమన్న నాసా

మెక్సికోసిటీ: గ్రహాంతరవాసులుగా భావిస్తున్న ఏలియన్స్ గురించి మరో వార్త వెలుగు చూసింది. 2017 వ సంవత్సరంలో పెరూ లోని నజ్కా ఎడారిలో తవ్వకాలు జరిగాయి. ఆ తవ్వకాల్లో వింత ఆకారం ఉన్న రేడు శకలాలు బయట పడ్డాయి. అవి చూడడానికి అచ్చం ఏలియన్ భౌతికకాయంలా ఉన్నాయని అభిప్రాయంతో ఉన్నారు. కానీ ఇప్పటివరకు ఈ విషయాల్ని రహస్యంగా ఉంచిన పరిశోధకులు ప్రస్తుతం తవ్వకాలలో బయటపడ్డ వింత ఆకారాలను మెక్సికో కాంగ్రెస్ సభ్యులకు తెలియజేసేందుకు ఏకంగా పార్లమెంట్ కి తీసువెళ్లారు. మెక్సికో పరిశోధకులు తాము ఇవి గ్రహాంతర వాసుల భౌతికకాయలని భావిస్తున్నామని...కానీ ఇప్పుడే స్పష్టత ఇవ్వలేమని చెప్పారు. ఈ సంఘటన పైన స్పందించిన నాసా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. నిజానికి ఆ వింత ఆకారాలు దేనికి సంబంధించినవి అనేదాని మీద స్పష్టత లేదని, ఇలాంటి విషయాలలో లోతైన పరిశీలన ముఖ్యం అని అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. అలానే ఏదైనా వింతగా అనిపిస్తే దాని పైన పరిశోధకులు పరిశోధనలు చేస్తూ ముందుకు వెళ్లాలని సూచించింది.

అధ్వాన రోడ్లు...

(మొదటిపేజీ తరువాయి)

పంచాయతీలో గల కొక్కిరాపల్లి ప్రధాన రహదారి నుంచి లకుళ్ళు, బొడ్డగుంది గ్రామం వరకు నిర్మించిన రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. రెండు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన తారురోడ్డు కనీసం రెండేళ్లు కూడా నిలవలేదు. గతంలో సుమారు మూడు కిలోమీటర్ల మేర పీఐయూ నిధులు సుమారు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన తారు రోడ్డు... ఇటీవల కాలంలో పూర్తిగా ధ్వంసమైంది. నాసిరకంగా నిర్మించడంతో ఈ రోడ్డు నిర్మించి సుమారు 15 నెలలు మాత్రమే అవుతున్నప్పటికీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని గ్రామస్తులు చెబుతున్నారు. మా గ్రామానికి రహదారి సౌకర్యం లేనప్పుడు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లమని, రోడ్డు వేయడంతో కష్టాలు తీరాయని ఆనందించినప్పటికీ కొద్ది నెలలకే రహదారి ఛిద్రమైందని ఆవేదన వ్యక్తం చేశారు. . బొడ్డగుంది అవతల చిట్టంపాడు వల్లంగుల గ్రామాలకు నూతన నిర్మాణ రోడ్డు పనులు జరుగుతుండడంతో సదరు కాంట్రాక్టర్ భారీ లారీలను ఈ రోడ్డుమీద రాకపోకలు సాగించడం వల్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిందని తెలిపారు. ఒక రోడ్డు కావాలంటే మరొక రోడ్డు పోవాల్సిందే అన్న చందాగా మారింది ఇక్కడ పరిస్థితి అని వాపోయారు. పక్క గ్రామాలకు రవాణా సౌకర్యం తమ గ్రామానికి శాపంగా మారిందని అంటున్నారు. రహదారి నిర్మించి రెండేళ్లు కూడా గడవకుండానే రోడ్డు దెబ్బ తిందని, సంబంధిత ఉన్నత అధికారులు జోక్యం చేసుకొని దీనికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, మూడుకిలోమీటర్ల మేర తారురోడ్డును పునర్నిర్మించి తమ గ్రామాలకు రవాణా సౌకర్యం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న రహదారి పరిస్థితి ఇలా ఉంటే ఇక మారుమూల గ్రామాల రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో...అధికారుల పర్యవేక్షణ ఎంత మాత్రం ఉందో అంచనా వేయొచ్చు. ఏది ఏమైనప్పటికీ జిల్లాలో రహదారుల నిర్మాణం తరచూ విమర్శలకు గురవుతోంది. కాంట్రాక్టర్లతో అధికారులు కుమ్మక్కయ్యి పర్యవేక్షణ సరిగా చేయడం లేదని, దీంతో కోట్ల రూపాయల ప్రజా ధనం వృథా అయితోందని గిరి జనం ఆరోపిస్తున్నారు.

కేరళను కలవరపెడుతున్న నిఫా

(మొదటిపేజీ తరువాయి)

నిర్ధారించారు. ఓ 39ఏళ్ల వ్యక్తికి నిపా వైరస్ సోకినట్లు నిర్ధారించినట్లు రాష్ట్ర ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ కార్యాలయం శు క్రవారం తెలిపింది. అతను ఆసుపత్రిలో పరిశీలనలో ఉన్నాడు. ఆ వ్యక్తి ఆగస్టు 30న నిఫాతో మరణించిన రోగితో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నాడని పేర్కొన్నారు. ఈ కొత్త కేసుతో కోజికోడ్‌లో మొత్తం నిఫా సంక్రమణ కేసుల సంఖ్య ఆరుకు పెరిగింది.మరోవైపు చికిత్స పొందుతున్న రోగుల సంఖ్య పెరగడంతో వ్యాధి సోకిన వ్యక్తితో పరిచయం ఉన్న, వ్యాధి బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉన్న వారందరినీ పరీక్షించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కేరళలో నిపా వైరస్ ఇన్‌ఫెక్షన్ నిర్ధారణ కావడం ఇది నాలుగోసారి. సాధారణంగా ఈ వైరస్ జంతువుల నుంచి మనుషులకు వ్యాపిస్తుంది. తాజాగా రాష్ట్రంలో కనిపిస్తున్న నిపా స్ట్రెయిన్ బంగ్లాదేశ్ వేరియంట్‌ను పోలి ఉందని అధికారులు చెబుతున్నారు.

కాలేజీలపై ఖాకీ కన్ను

(మొదటిపేజీ తరువాయి)

అవసరముంది. ఈ సమయంలో పోలీసులు కాలేజీలు మూసివేయాలని ఆదేశించారు. కళాశాలల యాజమాన్యంపై ఒత్తిడి తీసుకొచ్చారు. చేసేది లేక యాజమాన్యాలు సైతం కాలేజీలు మూసివేశారు. టీడీపీ సానుభూతిపరులు ఎక్కువుగా ఉండే ప్రాంతాల్లోని కాలేజీల వద్ద పోలీసులు నిఘా పెంచారు. రాష్ట్రంలోని అనేక కళాశాలల్లోనూ నిఘా ఉంచినట్లు సమాచారం. టీడీపీ-జనసేన పొత్తును స్వాగతిస్తూ విశాఖపట్నం గీతం విశ్వవిద్యాలయం ఎదుట పోస్టర్లు వెలవడంపై పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాటి తొలగింపులో పోలీసులకు, జనసేన నేతలకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసుల వ్యవహార శైలిపై విపక్షాలు మండిపడుతున్నాయి.

సుప్రీంకోర్టులో కవితకు ఊరట

విశాలాంధ్ర-హైదరాబాద్: దిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈ నెల 26 వరకు కవితకు సమన్లు జారీ చేయవద్దని అత్యున్నత న్యాయస్థానం ఈడీని ఆదేశించింది. నళినీ చిందబరం తరహాలోనే తనకూ ఊరట ఇవ్వాలని ఎమ్మెల్సీ కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆమె వేసిన పిటిషన్‌పై ఈడీ న్యాయవాది స్పందనను సుప్రీం ధర్మాసనం కోరింది. అందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. అందులో భాగంగా ఈ నెల 26 వరకు సమన్లు జారీ చేయవద్దని ఈడీకి జస్టిస్ కౌల్ ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది.

కాంగ్రెస్ ఎన్నికల వ్యూహం

నేడు హైదరాబాద్‌లో పునర్నిర్మిత సీడబ్ల్యూసీ తొలి భేటీ

రేపు పార్టీ విస్తృత స్థాయి సమావేశం... 'విజయ భేరి' సభ

తెలంగాణ ప్రజలకు ఆరు హామీల ప్రకటన

న్యూదిల్లీ : ఐదు రాష్ట్రాలలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలకు వ్యూహాన్ని రూపొందించేందుకు పునర్నిర్మించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) మొదటి సమావేశం శనివారం ఇక్కడ జరగనుంది. తెలంగాణ రాజధానిలో సీడబ్ల్యూసీ సమావేశం నిర్వహించడం, ఎన్నికల నేపథ్యంలో పార్టీ ప్రచారాన్ని పెంచడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సర్వశక్తులు ఒడ్డుతుందన్న స్పష్టమైన సందేశాన్ని పంపే ప్రయత్నం. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేతల మేధోమథనం తెలంగాణ రాజకీయాలకు, చారిత్రక పార్టీకి 'ఆట మార్చేది', 'పరివర్తన కదలిక' అని రుజువు చేస్తుందని నాయకులు చెప్పారు. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి సంబంధించిన ప్రణాళికలను ప్రకటించిన ప్రధాన కార్యదర్శులు కె.సి.వేణుగోపాల్, జైరాం రమేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ దిల్లీ వెలుపల మూడు రోజుల పాటు చర్చలు జరపడం చాలా ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు సీడబ్ల్యూసీ సమావేశం కానుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికల వ్యూహంపై చర్చిస్తుందని వేణుగోపాల్ ప్రకటించారు. ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న మధ్య ప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్, తెలంగాణ, మిజోరాంలో కాంగ్రెస్ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) విస్తృత సమావేశం జరుగుతుందని, అన్ని రాష్ట్ర పార్టీల ముఖ్య నేతలు, సీఎల్‌పీ నేతలు, పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ బేరర్లు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులను రాబోయే ఎన్నికలపై వ్యూహరచన చేసేందుకు ఆహ్వానిస్తున్నామని వేణుగోపాల్ తెలిపారు. 'మేము 159 మందిని ఆహ్వానించాము. వారిలో 147 మంది ఆదివారం సమావేశానికి హాజరవుతున్నారు' అని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో భారత్ జోడో యాత్ర మలివిడత నిర్వహించే సాధ్యాసాధ్యాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. తెలంగాణ జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17న సాయంత్రం హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆరు హామీలను ప్రకటిస్తామని తెలిపారు. 'రేపు మధ్యాహ్నం 2:30 గంటలకు మొదటి సీడబ్ల్యూసీ సమావేశాన్ని నిర్వహిస్తాము. కాంగ్రెస్ అధ్యక్షురాలు హాజరవుతారు.

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, శాశ్వత ఆహ్వానితులు, ప్రత్యేక ఆహ్వానితులతో సహా ఇతర కార్యవర్గ సభ్యులు అందరూ పాల్గొంటారు. 90 మందిని ఆహ్వానించామని, అయితే వారిలో ఆరుగురు తమ వ్యక్తిగత ఇబ్బందుల కారణంగా హాజరు కాలేకపోతున్నారని తెలియజేశారన్నారు. తమ పార్టీ నలుగురు ముఖ్యమంత్రులతో సహా మిగతా 84 మంది హాజరవుతారని వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం తెలంగాణ కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్‌ల 'విజయ భేరి' ఉంటుందని, ఇక్కడ తమ ప్రభుత్వ ఏర్పాటుకు నాంది పలుకుతుందని వేణుగోపాల్ తెలిపారు. సెప్టెంబరు 18న పార్టీ పార్లమెంటు సభ్యులు తిరిగి పార్లమెంటు సమావేశాలకు హాజరవుతారని చెప్పారు. భారత్ జోడో యాత్ర తర్వాత తెలంగాణలో పార్టీ శ్రేణుల్లో ఇది కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, రాబోయే ఎన్నికల్లో తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ద్వారా పార్టీకి ఇది మంచి ఫలితాలను ఇస్తుందని తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఆరు హామీలు ప్రకటిస్తామని, ఎన్నికలు రాగానే ఆ పార్టీకి ప్రజల నుంచి స్పష్టమైన ఆదేశం వస్తుందని ఆశిస్తున్నామని ఆదివారం సాయంత్రం జరగనున్న భారీ ర్యాలీని ఉద్దేశించి జైరాం రమేశ్ అన్నారు. కె.చంద్రశేఖర్‌రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తుతూ, 'మోదీ ప్రభుత్వం, కేసీఆర్ ప్రభుత్వం ఒకే నాణేనికి రెండు ముఖాలు అని ఒక్కటి అర్థం చేసుకోండి... వాటి మధ్య ఎలాంటి తేడా లేదు. దిల్లీలో నరేంద్ర మోదీ ఉన్నారు. హైదరాబాద్‌లో కేసీఆర్ ఉన్నారు' అని అన్నారు. సీడబ్ల్యూసీ సమావేశం చారిత్రాత్మకమని, ఇది తెలంగాణ రాజకీయాలను మలుపు తిప్పుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సృష్టించింది కాంగ్రెసేనని వేణుగోపాల్ వాదిస్తూ, 'తెలంగాణకు హామీ ఇచ్చాము. మేము ఇచ్చాము. కానీ దురదృష్టవశాత్తు తెలంగాణను ఇచ్చిన తరువాత ఈ బీఆర్ఎస్ రాష్ట్రాన్ని ఎలా పాలిస్తున్నదో మీకు తెలుసు. ఈ మొత్తం తెలంగాణ ప్రభుత్వం అత్యంత అవినీతి రాష్ట్రంగా మారింది' అని అన్నారు.

విచ్ఛిన్నకర మోదీ

న్యూదిల్లీ : కేంద్రంలో బీజేపీ సర్కార్ అధికారంలోకి వచ్చింది మొదలు 'దేశమంతా ఒక్కటే' అంటూ ప్రకటనలు చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగా 'ఒకే దేశం-ఒకే రేషన్', 'ఒకే దేశం-ఒకే రిజిస్ట్రేషన్', 'ఒకే దేశం-ఒకే పన్ను', 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' అనే విధాన ప్రతిపాదనలను తెరమీదకు తీసుకువచ్చింది. మోదీ పరివారమంతా పైకి సమైక్య భారతమంటూ చెప్పుకొస్తున్నారు. కానీ అందుకు భిన్నంగా ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో తీరుగా చూస్తూ పరోక్షంగా రాష్ట్రాల మధ్య వైరుధ్యాలకు కారణమవుతున్నారు. ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు కన్న తల్లి ప్రేమను చూపుతూ దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను ప్రదర్శిస్తున్నారు.

ఆర్థిక సమన్యాయ లేమి ఇలా..

దేశ జనాభాలో దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడు వాటా 19.5 శాతంగా ఉంది. ఉత్తరాది రాష్ట్రాలు యూపీ, బీహార్ జనాభా 26 శాతం. అయితే యూపీ, బీహార్‌తో పోలిస్తే జీడీపీలో దక్షిణాది వాటా 4.2 రెట్లు ఎక్కువ. భారత కార్పొరేట్-ఆదాయ పన్ను రాబడిలో దక్షిణాది వాటా 25 శాతం వరకు ఉంటుంది. ఇదే సమయంలో ఉత్తర ప్రదేశ్, బీహార్ వాటా కేవలం 3 శాతమే. కేంద్ర ప్రభుత్వ ఖజానాకు ఎక్కువ ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక సమన్యాయం తగినవిధంగా జరగటం లేదన్న వాదనలు ఎప్పటినుంచో ఉన్నాయి. 2017లో తీసుకువచ్చిన జీఎస్‌టీ కారణంగా దక్షిణాది రాష్ట్రాలు ఎక్కువగా నష్టపోతున్నాయి. బకాయిల చెల్లింపులో కేంద్రం నాన్చివేత ధోరణే దీనికి కారణం. గడిచిన మూడేళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు రూ.2,433 కోట్ల జీఎస్‌టీ పరిహారం రావాల్సి ఉంది. ఇక, దక్షిణాది రాష్ట్రాలపై ఉత్తరాది భాష, సంస్కృతులను రుద్దాలని బీజేపీ అనేక సార్లు ప్రయత్నాలు చేసింది. 2019లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ దేశమంతటికీ ఉమ్మడి భాషగా హిందీ ఉండాలని, ఆ భాషనే ఎక్కువ మంది మాట్లాడుతున్నారని... హిందీ మాత్రమే దేశం మొత్తాన్ని ఐక్యం చేయగలదని చెప్పుకొచ్చారు. హిందీని దేశంలోని వివిధ ప్రాంతాలకు విస్తరించేందుకు ప్రయత్నిస్తామని వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై దక్షిణాది రాష్ట్రాలతో పాటు ప్రజలందరూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చట్టసభల్లో ప్రాతినిధ్యంలోనూ...

2026లో కేంద్రం తీసుకురావాలనుకొంటున్న 'జనాభా ప్రాతిపదికన పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన విధానం' తో దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరగనున్నది. దేశ జీడీపీలో దక్షిణాది రాష్ట్రాల వాటా 33 శాతం కాగా, పార్లమెంటులో మాత్రం వాటి ప్రాతినిధ్యం కేవలం 20 శాతానికి పరిమితం కానుంది. జనాభా నియంత్రణలో గత కొన్నేళ్లుగా క్రమశిక్షణతో ముందుకు సాగుతున్న దక్షిణాది రాష్ట్రాలకు ఇప్పుడు ఆ క్రమశిక్షణే పెద్దశిక్షగా మారనున్నది. ఇదే సమయంలో జనాభా నియంత్రణను గాలికొదిలేసి ఎక్కువ జనాభాతో ఉన్న యూపీ, బీహార్‌కు కేంద్రం తాజాగా తీసుకురానున్న విధానం లబ్ధి చేకూర్చనున్నది. ఉదాహరణకు... తెలంగాణలో 17 లోక్‌సభ సీట్లు ఉన్నాయి. రాష్ట్ర జనాభా 3.8 కోట్లు. జనాభాను లోక్‌సభ సీట్లతో గణిస్తే 22 లక్షల మందికి ఒక ఎంపీ ఉన్నట్టు లెక్క. అదే బీహార్ విషయానికి వస్తే... ఆ రాష్ట్ర జనాభా 12.6 కోట్లు. లోక్‌సభ సీట్లు 40. అంటే, 32 లక్షల మందికి ఒక ఎంపీ ఉన్నట్టు అర్థమవుతున్నది. ఈ లెక్కన ప్రస్తుత జనాభాకు అనుగుణంగా ఎంపీ స్థానాలను సవరిస్తే లోక్‌సభలో బీహార్ ప్రాతినిధ్యం రెట్టింపవుతుంది. అంటే, జనాభా నియంత్రణను సరిగ్గా అమలుచేయని బీహార్‌కు రాజకీయ లబ్ధి చేకూరుతుంది. జాతీయ ప్రయోజనాలను ఆశించి జనాభా నియంత్రణను పాటించిన తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుంది. మరోవైపు, తలసరి ఆదాయాన్ని పరిశీలిస్తే, రూ.3.12 లక్షలతో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉంది. జాతీయ సగటు 1.7 లక్షల కంటే ఇది 84 శాతం ఎక్కువ. అంతేకాదు... తలసరి ఆదాయంలో టాప్-5 స్థానాల్లో దక్షిణాది రాష్ట్రాలే ఉన్నాయి. జాతీయ సగటు కంటే ఈ రాష్ట్రాల్లో తలసరి ఆదాయం ఎక్కువగా ఉంది. అలాగే, జీఎస్డీపీలో రుణాల వాటా ఎంత తక్కువగా ఉంటే ఆ రాష్ట్రం ఆర్థికంగా అంత బలోపేతంగా ఉన్నట్లు. ఈ విషయంలో తెలంగాణే (25.3 శాతం) తొలిస్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో కర్నాటక (27.5 శాతం), తమిళనాడు (27.7 శాతం), ఏపీ (32.8 శాతం), కేరళ (37.2 శాతం) ఉన్నాయి. తక్కువ వడ్డీలను చెల్లిస్తూ తెలంగాణ (11.3 శాతం) అగ్ర స్థాయిలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో కర్నాటక (14.3 శాతం), ఏపీ (14.3 శాతం), కేరళ (18.8 శాతం), తమిళనాడు (21 శాతం) ఉన్నాయి. పన్ను రాబడులు, స్థూల ద్రవ్యలోటు సూచీల్లోనూ దేశంలోని అన్ని రాష్ట్రాలను తోసిరాజని దక్షిణాది ఐదు రాష్ట్రాలు తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి.

గోడు చెప్పబోతే...

గొంతు నొక్కేశారు

(మొదటిపేజీ తరువాయి)

మాయమాటలు చెప్పి సీపీఐ కార్యాలయంలో ఉన్న ఆయనను బయటకు పిలిచి అరెస్టు చేశారు. నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేసినప్పటికీ చావోరేవో తేల్చుకుందామనే లక్ష్యంతో మారువేషాలతో అగ్రిగోల్డ్ బాధితులు నగరానికి చేరుకున్నారు. గోడు చెబుదామంటే గొంతు నొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాధితులకు అండగా ఉంటాం: రామకృష్ణ

అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హామీ ఇచ్చారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర సమితి అధ్వర్యంలో తలపెట్టిన చలో విజయవాడ శంఖారావ దీక్షకు వస్తున్న బాధితులను పోలీసులు అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ అసోసియేషన్ నాయకులు వి.తిరుపతిరావు, బీవీ చంద్రశేఖర్ అధ్యక్షతన విజయవాడ దాసరిభవన్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రామకృష్ణ మాట్లాడారు. జగన్ ప్రభుత్వ తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో అగ్రిగోల్డ్ బాధితులు, ప్రజలు ఓట్లతో బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయకపోతే జగన్ అధికారానికి దూరమవడం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి మాట్లాడుతూ సమిష్టి పోరాటాలతో అగ్రిగోల్డ్ బాధితుల డిమాండ్లు సాధించుకుందామని చెప్పారు. సీపీఎం రాష్ట్ర నాయకులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీలు మోసం చేయటం సహజమేనని, కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజల్ని మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ఆంధ్ర మేధావులు ఫోరం చైర్మన్ చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యమాన్ని రాజకీయం చేయకుండా...పాలకులను నిలదీసేందుకు ఉద్యమించాలని సూచించారు. లోక్‌సత్తా రాష్ట్ర నాయకులు బి.బాబ్జి మాట్లాడుతూ అసోసియేషన్ చేపట్టే పోరాటాలకు తమ పార్టీ మద్దతు ఉంటుందన్నారు.



దీక్షను అడ్డుకోవాల్సి అవసరం ఏమిటి: ముప్పాళ్ల

అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావ దీక్షను పోలీసులు అడ్డుకోవడంపై అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఐ కార్యాలయంలోకి సైతం ఎవరినీ వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటుచేయడంపై మండిపడ్డారు. విజయవాడలో ఎమర్జెన్సీ విధించారా అని ప్రశ్నించారు. కార్యాలయం లోపల కూడా సమావేశం పెట్టకుండా పోలీసులు అడ్డుకున్నారని ఆరోపించారు. తొమ్మిదేళ్ల తమ పోరాటంలో ఏనాడు శాంతిభద్రతల సమస్య ఉత్పన్నం కాలేదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని శాంతియుతంగా శంఖారావ దీక్షకు పూనుకుంటే...వందలమందిని అక్రమంగా అరెస్టు చేసి దీక్షను అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని ముప్పాళ్ల అన్నారు. ఆ తర్వాత సీపీఐ కార్యాలయంలో జరిగిన అగ్రిగోల్డ్ బాధితుల సదస్సులో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని పూర్తి సంఘీభావం ప్రకటించారు. మరణించిన అగ్రిగోల్డ్ బాధితుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని, దీనిపై 21వ తేదీ నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి జగన్ స్పష్టమైన ప్రకటన చేయాలని ముప్పాళ్ల డిమాండ్ చేశారు. తిరుపతిరావు మాట్లాడుతూ 32 లక్షల మంది కష్టార్జితాన్ని అవ్వా వెంకటరామారావు సోదరుల నుండి కక్కించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ నెల 19వ తేదీన నియోజకవర్గ కేంద్రాల్లో ప్రదర్శనలు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందించాలని రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు ప్రతిపాదించగా సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. గ్రామ, మండల, నియోజకవర్గస్థాయిలో కార్యకలాపాలను పటిష్టవంతంగా నిర్వహించి చివరి రూపాయి సాధించే వరకు ధైర్యంగా నిలబడాలని నాయుడు కోరారు. ఉదయం సీపీఐ కార్యాలయం వద్ద పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు పోలీసుల చెర నుంచి విడుదలైన బాధిత ఉద్యమకారులందరిని అభినందిస్తూ మద్దతు తెలిపారు. భవిష్యత్ పోరాటాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తులసిరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు బి.బాబ్జి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, జంగాల అజయ్‌కుమార్, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఆంధ్ర మేధావుల ఫోరం చైర్మన్ చలసాని శ్రీనివాస్, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బెల్లంకొండ శ్రీనివాసరావు, సిద్దేశ్వర్, సూరప్పడు, అసోసియేషన్ జిల్లాల నాయకులు పాల్గొన్నారు. బీవీ చంద్రశేఖర్ వందన సమర్పణ చేశారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్ అభ్యుదయ గీతాలు ఆలపించారు.

కార్మికవర్గ చైతన్యమే లక్ష్యం

- నిరంకుశ ప్రభుత్వాలపై నిరంతర పోరు
- రాష్ట్రస్థాయి ఉద్యోగ, కార్మిక, వైజ్ఞానిక శిక్షణ తరగతుల్లో ఓబులేసు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: నిరంకుశ ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి కార్మిక వర్గాన్ని చైతన్య పరుస్తున్నామని, అందులో భాగంగానే రాష్ట్రస్థాయి ఉద్యోగ, కార్మిక వైజ్ఞానిక శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు స్పష్టంచేశారు. అనంతపురం జిల్లా కేంద్రంలోని బీజీఆర్ ఫంక్షన్ హాల్‌లో 3 రోజులపాటు జరిగే రాష్ట్రస్థాయి ఉద్యోగ, కార్మిక, వైజ్ఞానిక శిక్షణా తరగతులను ఓబులేసు శుక్రవారం ప్రారంభించారు. మొదటి రోజు ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన శిక్షణా సమ్మేళనానికి ఓబులేసుతో పాటు వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, గౌరవాధ్యక్షుడు రాధాకృష్ణమూర్తి, ఉపప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, కోశాధికారి కొండలరావు, కమిటీ సభ్యుడు రమణయ్య, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శి నారాయణస్వామి హాజరయ్యారు. ముందుగా ఏఐటీయూసీ జెండాను రమణయ్య ఆవిష్కరించారు. ఓబులేసు మాట్లాడుతూ దేశ రాజకీయ పరిణామాలపై కార్మికవర్గానికి మంచి అవగాహన ఉండాలని సూచించారు. కార్మికులకు జరుగుతున్న నష్టం, పాలక వర్గాలు అనుసరించే విధానాలు తెలుసుకోవాలన్నారు. ఈ అంశాలపై అవగాహన కల్పించడానికి శిక్షణా తరగతులు దోహదపడతాయన్నారు. ఇప్పటికే ఒంగోలు, విశాఖ జిల్లాల్లో యువ మహిళ, యువకార్మిక వర్క్‌షాప్‌లు విజయవంతంగా నిర్వహించామన్నారు. పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ఓబులేసు విమర్శించారు. దీంతో 50 కోట్ల సంఘటిత, అసంఘటిత కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం జగన్‌మోహన్ రెడ్డి 'దాచుకో దోచుకో' అన్న చందంగా దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ సర్వనాశనం చేస్తున్నారని ఓబులేసు విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆటవిక విధానాలను తిప్పికొట్టడానికి కార్మిక, కర్షక, శ్రమజీవులు సంఘటిత పోరాటం చేయాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలను బలోపేతం చేసి అన్నివర్గాల కార్మికులను చైతన్య పరిచే దిశగా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఎం జగన్ నియంతృత్వంతో ప్రజల స్వేచ్ఛను హరించివేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగులకు పీఆర్‌సీ, పాత పెన్షన్ అమలు చేయకుండా 13 లక్షల మంది కార్మికులకు అన్యాయం చేస్తున్నారని, 2 కోట్ల మంది అంఘటిత కార్మికులు సైతం నష్టపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగదీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను, కార్మికులను నిలువునా మోసం చేస్తోందని విమర్శించారు. పాలకులు ఉద్యోగ, కార్మికసంఘాల్లో చీలికలు తెచ్చి పోరాట పటిమను నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. నిరంకుశ ప్రభుత్వాలకు గుణపాఠం చెప్పడానికి కార్మికులు, శ్రమ జీవులు సంఘటితం కావాలన్నారు. కార్మికుల హక్కుల కోసం జరిగే పోరాటాలకు సీపీఐ సంపూర్ణ మద్దతిస్తుందని హామీ ఇచ్చారు. ఏఐటీయూసీ కడప జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రామయ్య 'మార్క్సిస్టు తత్వశాస్త్రం', ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమసుందర్ 'భారతదేశ చరిత్ర-సంస్కృతి-వివిధ సామాజిక ధోరణులు', కార్మికబాట మాస పత్రిక సంపాదకుడు చలసాని రామారావు 'ఏఐటీయూసీ చరిత్ర-ఉజ్వల ఘట్టాలు', ప్రముఖ న్యాయవాది రాధాకృష్ణమూర్తి 'నాయకుడు-నాయకత్వ లక్షణాలు' అనే అంశాలపై బోధన చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, అధ్యక్షుడు రాజేశ్ గౌడ్, ఉప ప్రధానకార్యదర్శి మల్లికార్జున, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి, అధ్యక్షురాలు పార్వతీ ప్రసాద్, నాయకులు కృష్ణుడు, రాజు, శ్రీనివాసులు, బాషా, నారాయణ, అక్బర్, కృష్ణానాయక్, శివకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరికి 'ములాఖత్' నిరాకరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబను కలుసుకునేందుకు ఆయన సతీమణి భువనేశ్వరిని జైలు అధికారులు శుక్రవారం అనుమతించలేదు. వారానికి మూడుసార్లు ములాఖత్ ఇచ్చేందుకు అవకాశం ఉన్నా అధికారులు తిరస్కరించడాన్ని తెలుగుదేశం పార్టీ తప్పుబట్టింది. చంద్రబాబు అరెస్టు తర్వాత భువనేశ్వరి రాజమహేంద్రవరంలోనే ఉంటున్నారు. ములాఖత్‌కు అనుమతి నిరాకరించడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్తను అక్రమంగా అరెస్టు చేసిన ప్రభుత్వం ములాఖత్‌పైనా అమానుషంగా వ్యవహరిస్తోందని ఆక్షేపించారు. నిబంధనల ప్రకారం ములాఖత్‌కు అవాకాశం ఉన్నా, కాదనడం సరికాదన్నారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ నాలుగు రోజులు సెలవుపై వెళ్లగా, శుక్రవారం ఆయన స్థానంలో కోస్తాంధ్ర డీఐజీ రవికిరణ్ ఆ బాధ్యతలను స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన తొలిరోజే చంద్రబాబు సతీమణికి ములాఖత్‌ను తిరస్కరించడంతో కావాలనే రాహుల్‌ను సెలవుపై పంపి ఆ స్థానంలో చంద్రబాబు కుటుంబసభ్యులను ఇబ్బందిపెట్టేందుకు రవికిరణ్‌ను నియమించారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. జైలులో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కలిసేందుకు సతీమణి భువనేశ్వరి చేసుకున్న ములాఖత్ దరఖాస్తును జైలు అధికారులు నిరాకరించడం అప్రజాస్వామికమని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు మండిపడ్డారు.

స్కిల్ కుంభకోణంలో పవన్ వాటా ఎంత?

గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో పవన్ కల్యాణ్ భాగస్వామేనని, అందులో పవన్ వాటా ఎంత అంటూ గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్ సూటిగా ప్రశ్నించారు. యుద్ధం మొదలైందని, ఇక మీ పతనమే మిగిలిందన్నారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మంత్రి జోగి రమేశ్ మాట్లాడుతూ సీఎం జగన్‌పై యుద్ధమంటే ఐదు కోట్ల మంది ప్రజలపై యుద్ధమేనన్నారు. ఎవరిని కలవడానికి లోకేశ్ దిల్లీ వెళ్లారని, కలిసిన వారితో మీ నాన్న రూ.371 కోట్లు అవినీతికి పాల్పడినట్లు చెబుతావా? అని నిలదీశారు. ఇంతకాలం స్టేలతో బతికిన చంద్రబాబు పాపం పండిందన్నారు. పవన్ ఒకవైపు బీజేపీతో సంసారం, మరోవైపు టీడీపీతో తాళి అని ఎద్దేవా చేశారు. క్షణాల్లో బంధాలు, పార్టీలు ఎలా మారిపోతాయని నిలదీశారు. పరామర్శకు వెళ్లిన ఒక పార్టీ అధ్యక్షుడు ఏం చేయాలి?, చేసింది ఏంటి? అని ప్రశ్నించారు. చంద్రబాబును ఆరోగ్యం ఎలా ఉందని అడగాలని, రాజకీయాలేమిటని ప్రశ్నించారు. ఇప్పటి వరకు స్టేలతోనే కదా మీరు బతికారు?, ఇంకా నుంచి కుదరబోవని అన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చిత్రపటాన్ని ప్రపంచ పటంలో పెడతానన్న చంద్రబాబు స్కిల్ పేరిట అవినీతి చేయడంలో ఈ దేశానికి చూపించడాని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని జగన్ దేశానికి చూపించారన్నారు. మిగిలిన రాష్ట్రాల్లో ఉన్న ప్రతి ఒక్క ప్రభుత్వం జగన్ వైపు చూస్తున్నాయని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై సీఎస్‌కు ఏపీజేఏసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం వెలగపూడి సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డిని ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ కలసి వినతి పత్రం అందజేసింది. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రెటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ రావు, కోశాధికారి .మురళీకృష్ణనాయుడు అధ్వర్యంలో సిఎస్ ను ఉద్యోగులు కలిసి వివిధ సమస్యల్ని వివరించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సీనియార్టీ ప్రాతిపదికన ఏటా వేతనాలు పెంచాలని కోరారు. అప్కాస్ కార్పొరేషన్‌లో లేని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ చేర్చాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రభుత్వం వద్ద పెండింగులో ఉన్న ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు మాజీ గ్రామాధికార్ల పెన్షన్ పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ప్రస్తుతం ఉన్న వేతనాలను పెంచాలన్నారు. బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. అతి తక్కువ వేతనానికి పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం లేదని, చివరికి వారి తల్లి, తండ్రులకు, ఇతర కుటుంబ సభ్యులకు వచ్చే సంక్షేమ పథకాలనూ నిలుపుదల చేయడం చాలా బాధాకరమన్నారు.

సీఎస్‌కు ఏపీపీటీడీ(ఆర్టీసీ)ఎంప్లాయిస్ యూనియన్ సన్మానం

ఏపీ పీటీడీ(ఆర్టీసీ)ఎంప్లాయిస్ యూనియన్‌కు ప్రభుత్వం గుర్తింపుని ఇచ్చిన సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతూ ప్రభుత్వ సీఎస్ జవహర్ రెడ్డిని యూనియన్ నేతలు సత్కరించారు. ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ ఆర్టీసి ఉద్యోగుల గ్రాడ్యూటీ సమస్యతోపాటు పెండింగ్ లో ఉన్న సమస్యల్ని కూడా పరిష్కరించాలని కోరారు. యూనియన్‌కు గుర్తింపు ఇవ్వడంపై కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి, అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ సుమన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్, వీవీఆర్ఓ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎ.సాంబశివరావు, వీఆర్ఏ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గరికపాటి బ్రహ్మయ్యతో పాటు ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

'స్కిల్ డెవలప్‌మెంట్' వాస్తవాలివే

- పూర్తి వివరాలతో టీడీపీ వెబ్‌సైట్ ఆవిష్కరణ
- 2014 నవంబరు నుంచి కీలక అంశాలన్నీ వెల్లడి
- ప్రభుత్వ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భారీ కుంభకోణానికి పాల్పడ్డారంటూ ప్రభుత్వం పెద్దఎత్తున దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో... వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకు తెలుగుదేశం పార్టీ ప్రత్యేకంగా 'ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రూత్.కామ్' పేరుతో వెబ్ సైట్‌ను శుక్రవారం ఆవిష్కరించింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈ వెబ్‌సైట్‌ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు, చింతకాయల అయ్యన్న పాత్రుడు, వర్ల రామయ్య, నిమ్మల రామానాయుడు, కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ధూళిపాళ్ల నరేంద్ర, బీద రవిచంద్ర యాదవ్, పరుచూరి అశోక్‌బాబు, తెనాలి శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అవినీతి మచ్చలేని చంద్రబాబుపై అక్రమంగా కేసు పెట్టారని, దీనికి సంబంధించి అందరికీ వాస్తవాలు తెలియాలనే ఉద్దేశంతో వెబ్‌సైట్ ప్రారంభించామని చెప్పారు. 2014 నవంబర్ నుంచి జరిగిన అన్ని అంశాలు వెబ్‌సైట్‌లో పొందుపరిచామని, ఏపీ కంటే ముందు చాలా రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అమలైందని గుర్తుచేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ అద్భుతమంటూ కేంద్రం నాడు ఏపీకి అవార్డులు ఇచ్చిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా దాదాపు 2,17,500 మంది యువత ఐదు క్లస్టర్ల ద్వారా శిక్షణ తీసుకున్నారని, దీనివల్ల 65 వేల మందికి పైగా ఉద్యోగాలు పొందారని వివరించారు. యువతకు ఇంత మేలు చేసిన కార్యక్రమంపై వైసీపీ నేతలు దుష్ప్రచారం చేస్తూ చంద్రబాబుపై అవినీతి మచ్చ వేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నిరాధార ఆరోపణలు చేస్తూ రూ.380 కోట్లు అవినీతి జరిగిందని సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారన్నారు. అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు మాత్రం చంద్రబాబుపై అక్రమ కేసు బనాయించినట్లు నమ్ముతున్నారన్నారు. అందుకే చంద్రబాబు అరెస్ట్‌కు వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నారన్నారు. ఈ ప్రాజెక్టు ఆవశ్యకత, ఎందుకు రాష్ట్రంలో ప్రారంభించాల్సి వచ్చింది? ఈ ప్రాజెక్టు అమలైన తీరు, దానివల్ల లబ్ధిపొందిన వివరాలన్నింటినీ పొందుపరుస్తూ వెబ్‌సైట్‌లో వివరించామని అచ్చెన్నాయుడు తెలిపారు. వాస్తవాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకొని...ఇతరులకు కూడా చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జూనియర్ ఎన్టీఆర్ ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదని విలేకరులు ప్రశ్నించగా ఆ విషయం ఆయన్నే అడగాలన్నారు. ఎవరినీ స్పందించమని తాము అడగబోమన్నారు. సంబంధం లేని కేసులో చంద్రబాబుని ఇరికించడంతో ప్రజలు పెద్దఎత్తున రోడ్లపైకి వస్తున్నారన్నారు. జనసేన పార్టీతో ఏ విధంగా కలిసి ముందుకు వెళ్లాలన్న దానిపై త్వరలో కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు.

ఘోర రోడ్డు ప్రమాదం: నలుగురి మృతి

మృతులు ఒడిశా వాసులు

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం తెల్లగుంట్లపల్లి వద్ద శుక్రవారం వేకుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న డీజిల్ ట్యాంకర్‌ను వేగంగా వచ్చిన అంబులెన్స్ ఢీకొనడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న నలుగురు మృత్యువాత పడ్డారు. మృతులు ఒడిశా రాష్ట్రానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన ఉమేష్ చంద్ర అనేక వ్యక్తికి ఆరోగ్యం సరిలేకపోవడంతో కుటుంబ సభ్యులు వేలూరు ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం వేకుజామున వేలూరు ఆస్పత్రి నుంచి ఉమేష్ చంద్రను కిమ్స్ ఆస్పత్రికి చెందిన అంబులెన్స్‌లో ఒడిశాకు తరలిస్తుండగా చిత్తూరు-తిరుపతి జాతీయ రహదారిలోని తెల్లగుండ్లపల్లి వద్ద అంబులెన్స్ రోడ్డు పక్కన ఆగి ఉన్న డీజల్ ట్యాంకర్‌ను ఢీకొంది. అంబులెన్స్‌లో ప్రయాణిస్తున్న ఉమేష్ చంద్రతో పాటు అతని కుటుంబ సభ్యులు మధులత నాయక్, త్రిలోక్ చంద్ర నాయక్, విజయ్ సాహు సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అంబులెన్స్ డ్రైవర్ నిద్రమత్తులో ఉండడంతో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. గాయపడిన వారిని చిత్తూరు ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, చిత్తూరు పశ్చిమ సీఐ రవిశంకర్ రెడ్డి, తవణంపల్లి ఎస్ఐ సుధాకర్ రెడ్డి ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు.

నకిలీ ఓట్లపై సమగ్ర విచారణ

రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి పేర్ని నాని వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఓటర్ల పెరుగుదల నమోదు కాలేదని, ఈ విషయంపై ఎన్నికల కమిషన్ విచారించాలని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) కోరారు. సచివాలయంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్ మీనాను శుక్రవారం కలసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో 2014 నుంచి 2019వరకు, 2019 నుంచి 2023 వరకు నమోదైన ఓటర్ల సంఖ్య హెచ్చు తగ్గులకు సంబంధించి ఫిర్యాదులో వివరించారు. 2014 నుంచి 2019 వరకూ 30,08,032 ఓట్లు ఆయా ఓటర్ల జాబితాలో పెరిగాయని, 2019 నుంచి 2023 కాలంలో 38 వేల ఓట్లు మాత్రమే తగ్గాయని పేర్కొన్నారు. ఓటర్ల వృద్ధి 2014-19 మధ్య కాలంలో 8.1 శాతం మేర నమోదైందని, 2019 నుంచి 2023 మధ్య 0.09 శాతం క్షీణత నమోదైందని తెలియచేశారు. గతేడాది కంటే 2023 సంవత్సరంలో నికర ఓట్ల సంఖ్య తగ్గిందని, దీనిని బట్టి నకిలీ ఓట్లు ఎక్కువగా ఉన్నాయని స్పష్టమవుతోం దని పేర్కొన్నారు. 2019 ఓటర్ల జాబితా నుంచి నకిలీ ఓట్లను తొలగించే అంశాన్ని పరిశీలించాలని, నకిలీ ఓట్ల విషయంపై సమగ్రంగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. 2014లో రాష్ట్రంలో మొత్తం ఓటర్లు 3,68, 26,744 కాగా 2019లో మొత్తం ఓటర్లు 3,98,34,776 ఉన్నారని వివరించారు. 2014కు 2019కి మధ్య 30,08,032 ఓట్ల పెరుగుదల ఉందన్నారు. 2019కి 2023కి మధ్య 38,098 ఓట్లు తగ్గాయని పేర్ని నాని వివరించారు.

సూర్యనారాయణకు బెయిల్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వాణిజ్యపన్నుల పన్నుల చీఫ్ కమిషనర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కేఆర్ సూర్యనారాయణతో పాటు సహోద్యోగులు 2019 నుంచి 2021 మధ్య ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా వ్యవహరించారని ప్రభుత్వం అభియోగం మోపింది. ఏపీ జీఈఏ, ఏపీ కమర్షియల్ టాక్సెస్ సంఘాల అధ్యక్షుడిగా ఉన్న సూర్యనారాయణ వ్యాపారుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేశారని కూడా ప్రభుత్వం అభియోగాల్లో తెలిపింది. వీటిపై విజయవాడ సిటీ పోలీసులు కూడా కేసు నమోదు చేశారు. సూర్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం ప్రొసీడింగ్స్ కూడా జారీ చేసింది. ఈ కేసులో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో బెయిల్ మంజూరైంది. సూర్యనారాయణను అరెస్టు చేయవద్దని ఆదేశించిన సుప్రీం కోర్టు ... తదుపరి విచారణను నవంబరు 10కి వాయిదా వేసింది. సూర్యనారాయణ తరపున సుప్రీం కోర్టులో సీనియర్ కౌన్సిల్ సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా ఏపీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు ఏంటో తమకు తెలుసనని న్యాయమూర్తి అభయ్ ఓకా వ్యాఖ్యానించడం గమనార్హం.

సాగు భూములు, ఉపాధి

పేదలకు దక్కేంతవరకు పోరాటం

ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్

విశాలాంధ్ర-సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం చట్టాలను నిర్వీర్యం చేసి పేదలు, కార్మికుల జీవితాలతో ఆటలాడుకుంటోందని ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కాకినాడ జిల్లా మహాసభ సామర్లకోటలోని విశ్వబ్రాహ్మణ భవనంలో శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఆవుల శేఖర్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆవుల శేఖర్ మాట్లాడుతూ పేదలకు సాగు భూమి, ఉపాధి దక్కేంతవరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని, మోదీ ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని, కూలీలకు ఆరోగ్యానికి మందులు ఇవ్వడం లేదని, మజ్జిగ గానీ, నీరు గానీ, గడ్డపారలు సరఫరా చేయడం లేదని విమర్శించారు. రైతులకు ఎరువులపై సబ్సిడీలు ఇవ్వడం లేదన్నారు. భూ కబ్జాదారుల చేతుల్లో ఉన్న భూములను, సాగు భూములను పంచేవరకు భూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాల కింద పట్టణాల్లో సెంటు భూమి, గ్రామాల్లో సెంటున్నర భూమి ఇస్తోందని, అది ఎందుకూ పనిచేయదన్నారు. పట్టణాల్లో మూడు సెంట్లు, గ్రామాలలో ఐదు సెంట్లు భూమి పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో బాపట్లలో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర 22వ మహాసభ నిర్వహిస్తున్నామని, 25న సుమారు 10 వేల మందితో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తాటిపాక మధు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని అన్నారు. ఈ సమావేశంలో పెద్దిరెడ్డి సత్యనారాయణ, ఎలిసెట్టి రామదాసు, పప్పు ఆదినారాయణ, కేసువరపు అప్పలరాజు తదితరులు మాట్లాడారు. జిల్లా మహాసభ ప్రారంభానికి ముందు ప్రజానాట్యమండలి కళాకారులు మడగల రమణ, సప్ప సూరిబాబు, బర్ల లక్ష్మీనారాయణ, సుఖపట్ల బాబ్జి, అల్లూరి భద్రం, సమ్మి సత్యనారాయణ విప్లవ గేయాలు ఆలపించారు. ముందుగా బీకేఎంయూ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ కూలీలు, ప్రజా సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాగడానికి డబ్బులివ్వలేదని కన్నతల్లినే హతమార్చిన కొడుకు

విశాలాంధ్ర-రామభద్రపురం: వృద్ధాప్యంలో కంటికి రెప్పలా చూసుకోవలసిన కన్న కొడుకే కాలయముడు అవుతాడని ఆ మహాతల్లి ఊహించలేదు. వివరాల్లోకి వెళితే... విజయనగరం జిల్లా రామభద్రపురం మండలం వసంతల వీధిలోని రామ మందిరం వద్ద ఉప్పల రవణమ్మ (75), ఆమె కుమారుడు ఉప్పల శ్రీనివాస్ ఓ ఇంట్లో అద్దెకుంటున్నారు. శ్రీనివాస్ టిఫిన్ కొట్టు నడుపుకుంటూ తల్లి వద్దే ఉంటున్నాడు. అతడికి 46 ఏళ్లు వచ్చినా వివాహం జరగలేదు. ఈయన టిఫిన్ కొట్టు మీద వచ్చే డబ్బులతో రోజు తప్పతాగి ఇంటికి వచ్చి తల్లితో గొడవ పడుతూ ఉండేవాడు. గురువారం రాత్రి కూడా మద్యానికి డబ్బులు ఇవ్వమని తల్లిని అడిగాడు. ఆమె లేవని చెప్పడంతో తల్లి పై కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో తల్లీ కొడుకుల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. తాగడానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తల్లి రాత్రి నిద్రపోతుండగా... ఇంట్లో ఉన్న కర్రతో ఆమె తలపై బలంగా కొట్టాడు. అంతటితో ఆగకుండా నోటిలో నాలుకను బలవంతంగా పీకేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలి పోయింది. రాత్రంతా తల్లి మృతదేహం పక్కనే శ్రీనివాస్ పడుకున్నాడు. తెల్లవారి స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిందంతా చెప్పి లొంగిపోయాడు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Center, Governerpet, Vijayawada-520002 (A.P.)
E PROCUREMENT SHORT TENDER NOTICE
NIT No. 15 /MAU61-USI0HB(OTH)/102/2023-HB Dated: 15.09.2023
Name of Work: "Undertaking of Necessary repairs to the sensors, Taps, etc., in the Gents and Ladies washrooms in the High Court Building" - Estimated Cost Rs. 5.29 Lakhs.
The bid can be downloaded on AP e-procurement portal from 16.09.2023 to 19.09.2023 up to 14.00 Hrs. Due date for submission of Bid 19.09.2023 up to 15.00 Hrs, Technical bid opening 19.09.2023 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Vijayawada

సంపాదకీయం

ప్రతిపక్షం ఎగరేసిన పత్రికా స్వేచ్ఛ పతాకం

బహిష్కరణలు, నిషేధాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రతికూలమైనవి. కానీ మోదీ పరిపాలన మొదలైనప్పటి నుంచి మీడియాలో ఒక బలమైన భాగం ప్రభుత్వ ప్రచార సాధనంగా మారింది. ప్రభుత్వం తన ఘనత చాటుకోవడానికి అధికారిక వ్యవస్థల మీద ఆధారపడవలసిన అవసరమే లేకుండా పోయింది. ఇలాంటి మీడియానే గోదీ మీడియా అంటున్నారు. ఈ మీడియా వికృత చేష్టలను నిలువరించడానికి బహిష్కరణను మించిన మార్గం 'ఇండియా' ఐక్య సంఘటనకు కనిపించనందువల్లే 14 మంది ఆంకర్లను బహిష్కరించాలని నిర్ణయించారు. గోదీ మీడియా మీద ఏవగింపు విస్తృతంగానే వ్యక్తమైనప్పటికీ దానికి వ్యతిరేకంగా నేరుగా పోరాడే అవకాశం లేకుండా పోయింది. గోదీ మీడియాకు ప్రాతినిధ్యం వహించే 14 మంది ఆంకర్లను బహిష్కరించాలని గురువారం ప్రతిపక్షాల 'ఇండియా" ఐక్య సంఘటన సమన్వయ సమితి నిర్ణయించింది. ప్రతిపక్షం ఇలాంటి పోరాటంలో ముందు వరసలో ఉండడం బహుశ చరిత్రలో ఇదే మొదటిసారి కావొచ్చు. నిజానికి 14 మంది టీవీ ఆంకర్ల బహిష్కరణ అనడం కన్నా సహాయ నిరాకరణ అనడమే సముచితంగా ఉంటుంది. ప్రతిపక్షాలు ఈ 14 మంది ఆంకర్లు నిర్వహించే టీవీ చర్చల్లో పాల్గొనకూడదని నిర్ణయించారు. అందువల్ల ఇది సహాయ నిరాకరణే తప్ప బహిష్కరణ అనలేం. అయితే ప్రతిపక్షాలు బహిష్కరిస్తున్నది కొంతమంది ఆంకర్లనే తప్ప ఆ మీడియా సంస్థలను కాదు. యాజమాన్యాలనూ కాదు. యాజమాన్యాల ఆదేశం, ఒత్తిడి, దన్ను లేకుండా ఏ ఆంకర్ అయినా స్వతంత్రంగా ప్రభుత్వానికి లొంగిపోయి ప్రవర్తించే అవకాశం ఉంటుందా అన్నది పెద్ద ప్రశ్న. అయినా ప్రతిపక్షం తమ పోరాటాన్ని ఆంకర్లకే పరిమితం చేసింది. సహేతుకమైన కారణాలు ఉండవచ్చు. సాధారణంగా పత్రికలు, ప్రసార సాధనాలు ప్రభుత్వాలను నిలదీయడం సహజం. కానీ మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత గోదీ మీడియా ప్రభుత్వాన్ని, అధికార పార్టీని ప్రశ్నించకుండా ఆ ప్రశ్నలన్నీ ప్రతిపక్షాలను అడగడం చాలా విచిత్రంగా ఉంది. ఈ వికట పత్రికా రచయితలు కొత్త ఒరవడి ప్రారంభించారు. ప్రభుత్వాన్ని నిలదీయవలసిన బాధ్యతను విస్మరించిన గోదీ మీడియా సహజంగానే ప్రజాసమస్యలను పట్టించుకోవడమూ మానేసింది. ఏడాదికి పైగా ఢిల్లీ పొలిమేరల్లో రైతులు ఉద్యమం చేస్తే గోదీ మీడియా పట్టించుకోనేలేదు. అంతకుముందు జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఉద్యమం కొనసాగినా ఈ మీడియా ఎక్కడా కనిపించలేదు. కరోనా మహమ్మారి దేశమంతటినీ అల్లకల్లోలం చేసి, లక్షలాది మంది మృతికి కారణం అయినప్పుడు, కరోనాను ఎదుర్కోవడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైనప్పుడూ గోదీ మీడియా జాడే లేదు. పైగా ఇలాంటి అన్ని సందర్భాలలోనూ గోదీ మీడియా ప్రతిపక్షాలను నిలదీసి విలోమ దిశలో ప్రయాణించింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రతిపక్ష 'ఇండియా' ఐక్య సంఘటన విధిలేక 14 మంది ఆంకర్లను బహిష్కరించాలని నిర్ణయించింది. దీనివల్ల ప్రతిపక్ష నాయకులు, పార్టీలు గోదీ మీడియాలో కనీసం దుష్ట పాత్రల కిందో, ప్రతి నాయకుల లాగో కూడా కనిపించకపోవచ్చు. కానీ ప్రతిపక్షాల మీద గోదీ మీడియా దుమారం మాత్రం ఆగదు. బహిష్కరణకు గురైన ఆంకర్లు ఏకపాత్రాభినయం చేసి వీరంగం వేస్తారు. కానీ ప్రతిపక్షాల నిరసన మాత్రం ప్రజల మనసుల్లోకి ఎక్కుతుంది. అయితే ఖల్ నాయకుల పాత్ర పోషిస్తున్నది ఈ 14 మందే కాదు. ఇంకా చాలా మందే ఉన్నారు. ఈ జాబితాను ప్రతిపక్షాలు ముందు ముందు పొడిగిస్తాయేమో చూడాలి. గత తొమ్మిదిన్నరేళ్ల నుంచి మోదీ మీడియాను దూరంగానే ఉంచారు. అప్పుడప్పుడు తనకు అనుకూలంగా ఉండే వ్యక్తులకో, వార్తసంస్థలకో విడిగా ఇంటర్వ్యూలు ఇచ్చి సొంత ప్రచారం చేసుకున్నారు. కనీసం ఈ గోదీ మీడియాలోని వారిని కూడా మోదీ దరి చేరనివ్వలేదు. ఈ 14 మందిలో ఒక్కరు కూడా మోదీనే కాదు...అమిత్ షాను, రాజ్‌నాథ్ సింగ్‌ను, జె.పి.నడ్డాను నిలదీసిన సందర్భమే లేదు.

ఏ రోజు పత్రికలు తిరగేసినా సమాజం క్లిష్ట దశలో ఉంది అన్న అభిప్రాయం కలుగుతోంది. ఇదే అభిప్రాయాన్ని మీడియాకు కూడా వర్తింపచేయవచ్చు. మన దేశంలో అయితే మొట్టమొదటి పత్రిక 'బెంగాల్ గజెట్' నడిపిన అగస్టస్ హిక్కీ అష్టకష్టాలు పడ్డాడు. ఆయన భారతీయుడు కాదు. అయినా బ్రిటిష్ పాలనలోని దురాగతాల్ని ఎండగట్టాడు. అప్పటి ప్రభుత్వం ఆయనను ఇంగ్లాండుకు వెనక్కు పంపించింది. ఆ తరవాత ఆయన విపరీతమైన దారిద్ర్యం అనుభవించి దయనీయ స్థితిలో తనువు చాలించాడు. ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ విధించినప్పుడు పత్రికల మీద సెన్సార్‌షిప్ విధించారు. అచ్చేసే ప్రతి ముక్కా సెన్సార్ కత్తెరను దాటుకుని రావాల్సి వచ్చేది. ప్రభుత్వానికి నచ్చని వార్తకు ప్రచురణ యోగ్యతే ఉండేది కాదు. ఈ క్రమంలో ఈ నిరంకుశ ధోరణిని ప్రతిఘటించిన పత్రికా యాజమాన్యాలు, పత్రికా రచయితలూ ఉన్నారు. జైలు శిక్షలూ అనుభవించారు. అప్పుడు సెన్సార్‌షిప్ ప్రభుత్వం విధించింది. ఇప్పుడు దీనికి విరుద్ధమైన ధోరణి కొనసాగుతోంది. ప్రధాన స్రవంతిలోని పత్రికలు, ముఖ్యంగా ప్రసార సాధనాలు, సామాజిక మాధ్యమాలు-ఇలా సకల వ్యవస్థలు చాలావరకు ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్నాయి. ప్రభుత్వం విధించిన సెన్సార్‌షిప్‌కు వ్యతిరేకంగా అప్పుడు పోరాడిన పత్రికా యాజమాన్యాలను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. అసలు పోరాటం అంతా పత్రికా రచయితలే కొనసాగించారు. అందువల్ల వృత్తి ధర్మానికి కట్టుబడాలనుకున్న, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం తమ హక్కు అనుకున్న పత్రికా రచయితలు అనేకమంది తమ ఉద్యోగాలు కూడా వదులుకుని ఎవరికి వారు ఒంటరిగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. అయితే ఇలా పోరాడుతున్న వారు ప్రధానమైన పత్రికలు, ప్రసార సాధనాల్లో మిగల లేదు. ఈ పోరాటం సామాజిక మాధ్యమాల ద్వారానే ఎక్కువగా సాగుతోంది. ప్రభుత్వ అనుకూల, వ్యతిరేక పత్రికలు ఎప్పుడూ ఉండేవి. ఉంటాయి. కానీ స్వచ్ఛందంగా దాసోహం అనే పత్రికా వ్యవస్థలు మోదీ హయాం కారణంగా పుట్టిన ప్రత్యేక జాతి అనుకోవాలి. గోదీ మీడియా ఆగడాలు రోత పుట్టిస్తున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థ పరిరక్షణకు పత్రికలు సాగించిన పోరాటాన్ని మరుగు పరచడానికి తీవ్ర ప్రయత్నమే జరిగింది. పత్రికాస్వేచ్ఛ అన్న మాటను మోదీ హయాంలో గోదీ మీడియా నవ్వుల పాలు చేసింది. అవసరమైన మేళతాళాలు గోదీ మీడియానే సమకూర్చింది కనక ప్రభుత్వ ప్రచారం సునాయాసంగా కొనసాగింది. అందుకే పత్రికా స్వేచ్ఛ కోసం పాటుపడే పత్రికా రచయితలు, పత్రికా సిబ్బంది సంఘాలు కూడా ఈ విషయాన్ని లేవనెత్తే సందర్భమే రాలేదు. ఈ స్థితిలో ప్రతిపక్షాలు గోదీ మీడియా మీద యుద్ధం ప్రకటించడం చారిత్రాత్మక పరిణామం. ప్రతిపక్షాలలో అతి పెద్దదైన కాంగ్రెస్ హయాంలోనే సెన్సార్‌షిప్ విధించారు అని దెప్పి పొడుస్తున్న వారూ ఉన్నారు. ఆ మాట నిజమే. ఆ సెన్సార్‌షిప్ ప్రభుత్వ వ్యతిరేక గొంతు పెగలకుండా చేసినందువల్లే ఆ తరవాతి ఎన్నికలలో ఘోరపరాజయానికి గురికావలసి వచ్చిందన్న తెలివిడి కాంగ్రెస్‌కు కలగలేదనుకోలేం.

ప్రసేన్ 63 ఎంఎం థియేటర్‌లో... ఇచ్చట సినిమాలు ఉతకబడును...

ఇదిగో ఇతగాడే ప్రసేన్ అంటే "బండెడు అసత్యాలు.. గంపెడు వక్రీకరణలు.. బోలెడంత చెత్త, నేలబారు టేకింగ్... భరించలేనంత బోర్... ఇంకొన్ని కలిస్తే..." ఇది కాశ్మీర్ ఫైల్స్ అనే సినిమా సమీక్ష. దేశంలో రాజకీయ భక్తి, భక్తి రాజకీయం పెరిగిపోయిన సందర్భంలో జీవిస్తున్నాం. పైగా ఈ కాశ్మీర్ ఫైల్స్ సినిమా తర్వాత ఆ సినిమాని పొగడడం ద్వారా నీ దేశభక్తిని నిరూపించుకోవాల్సిన సందిగ్ధ సందర్భంలో ఉన్నాం. నా అనేకానేక ఇష్ట కవులలో ఒకరైన ఖాదర్ మొహియుద్దీన్ తన 'పుట్టుమచ్చ' దీర్ఘ కవితలో "క్రికెట్ మ్యాచ్ నా దేశభక్తికి తూనికా, కొలమానమూ అవుతుంది" అంటాడు. ఆ కాలంలో ఆ కవి జన్మరీత్యా ఇలా అన్నాడేమో కాని... ఈ కాలంలో మాత్రం ఈ దేశంలో ఉన్న సమస్త మానవులు కాశ్మీర్ ఫైల్స్ గొప్పతనం గురించి మాట్లాడి దేశభక్తుల జాబితాలో విధిగా చేరాల్సిందే. ఆ జాబితాలో చేరేందుకు ససేమిరా ఇష్టపడని ఓ పొగరుబోతు రాసిన సినిమా సమీక్షల పుస్తకం "ప్రసేన్ ఏ సినిమా" లో "నేటి సినిమా రీళ్లను ఉతికి ఆరేయడం ఇలా" అనే మరో పుస్తకం కూడా కనిపించింది నాకు. ఇది శివరాత్రికి ఒకే టిక్కట్ మీద రెండు సినిమాలు చూసిన ఆనందం వంటిది. ఈ ప్రసేన్ ఖర్మ తొలి తెలుగు కవి. పూర్వ జన్మలో చేసిన ఖర్మ కూడా ఈ జన్మలో

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

వెంటాడి కాలిపోవడం వల్ల జర్నలిస్టు కూడా. ఈ రెండు జాడ్యాలకి, ఈ రెండు దీర్ఘ రోగాలకి, ఈ రెండు వ్యసనాలకి తోడుగా సినిమా సమీక్షకుడు అనే మరొకటి కలిసి మూడక్షరాల ప్రసేన్ అయ్యాడు. ఓ పెద్ద హీరో నటించిన బాలీవుడ్‌లో ఇరగదీసిన సినిమాని తెలుగులో మరో పెద్ద హీరో అనువాదం అంటే రీమేక్ చేస్తే రెంటికి తేడాలు చెప్పడమే తెలిసిన ప్రేక్షక పాఠకులం మనం. ఇంతకు ముందే చెప్పినట్లుగా పొగరుబోతు ప్రసేన్ కదా... తెలుగులో రీమేక్ చేసిన వకీల్ సాబ్ ఎంత ఛండాలమో అక్షరం ముక్కైనా చెప్పకుండా దాని ఒరిజినల్ పింక్ ఎంత బాగుందో చెప్పాడు. ఇదీ ఒకే టిక్కట్‌పై రెండు సినిమాల్లాంటిదే. ఈ సమీక్ష చదివి పింక్ సినిమా చూస్తే.... వీరాభిమానులు కూడా వకీల్ సాబ్ సినిమా చూడడానికి వాయిదాల మీద వాయిదాలు అడుగుతారు. ""సినిమా కోసం వెళ్తే కావ్యం దొరుకుతుంది" ఇదీ సమీక్షే. మహానటి సినిమా గురించి. సినిమాని ఇలా చూడాలి అని నేర్పిన సమీక్ష ఇది. దర్శకుడి ప్రతిభను అతను పడ్డ కష్టం నుంచి చెప్పడం ఒక్క ప్రసేన్‌కే సాధ్యమవుతుంది. అందరికి తెలిసిన ఓ వాస్తవాన్ని "మీకు తెలిసిందే కొత్తగా చెబుతున్నాను" అంటూ చెప్పడానికి చాలా కష్టపడాలి. అలా కష్టపడిన దర్శకుడు నాగ్ అశ్విన్. అందుకే ఈ మహానటి గురించి నేను రాయాలనుకున్నది ప్రసేన్ రాసేశాడు. ఓ కవితో, కథో, సినిమానో చదివిన తర్వాత, చూసిన తర్వాత మనం ఏమనుకున్నామో అవన్నీ ఒద్దికగా కూర్చుని మల్లెదండ అల్లినట్టుగా మరొకరు మాలకడితే ఎలా ఉంటుందో అలా ఉంది ఈ మహానటిపై ప్రసేన్ భాష్యం. " వృద్ధాప్యం సంతానం సాలెగూట్లో పురుగు" అంటాడు కవి శివారెడ్డి. ఆ ఏక వాక్యాన్ని నందినీరెడ్డి ఓ బేబీ అంటూ సినిమా తీస్తే.... ప్రసేన్ ఆ వాక్యాన్ని, సినిమాని కూడా సర్వనామం చేసేశాడు తన మార్కుతో. మంచి సినిమా తీయడం కంటే ఆ సినిమా మీద వచ్చిన మంచి రివ్యూని చదివితే ఆ దర్శకులకి, అందులో నటించిన వారికి కలిగే ఆనందం ఎలా ఉంటుందో ప్రసేన్ రాసింది చదివితే అలాగే అనిపిస్తుంది. జర్నలిస్టుగా ప్రసేన్‌తో కలిసి పనిచేసిన దురదృష్టవంతుల్లో, ఈర్ష్యాసూయలు పెంచుకున్న వారిలో నేనూ ఒకడ్ని. పోలీసుల్లో నక్సలైట్లు, నక్సలైట్లలో పోలీసులు కలగలిసి పోయిన వార్తా కథనానికి ప్రసేన్ హెడ్డింగ్ "నక్సలీసులు". ఇలాంటివే ఈ ప్రసేన్ ఏ సినిమాలో అనేకం ఉన్నాయి. దర్శకుడు మారుతి తీసిన ఓ సినిమా రివ్యూకి ప్రసేన్ హెడ్డింగ్ మాసిపూసి "మారుతీకాయి". ఇలాంటిదే మరొకటి నాగార్జున గురించి... "సైకిల్ చైన్ నుంచి రుద్రాక్షమాల", ప్రభాస్ సినిమా "ఆదిపురుష్"కి ప్రసేన్ రివ్యూ టైటిల్ "సోది పురుష్". అన్నీ బాగానే ఉన్నాయి కాని.... వాస్తవ కథకి కమర్షియల్ కుళ్లుని జోడించి తీసిన విరాటపర్వం దర్శకుడు వేణుకి ప్రసేన్ "లవ్వూ వేణు రాజా" అని చెప్పడం పోసాని మార్కు అసహ్యపు కామెడీ. ఇంతకీ చెప్పొచ్చేదేమిటంటే.... తెలుగు సినిమా చండాలం గురించి చెప్పడానికి ఏం లేదని.... ఆస్కార్ కొట్టేసిందని చెప్పుకుంటున్న తెలుగు పాటని సినీకవులు వీలున్నప్పల్లా వస్త్రాపహరణం చేస్తున్నారని బాధపడిపోయిన ప్రసేన్ శ్రీ కృష్ణునిలా చీరలివ్వలేదు... రివ్యూ అంటూ ఆ సినీ కవుల బట్టలూడదీసాడు. చివరాఖరుగా... నిర్మాతలూ... డబ్బులు ఎవరికి ఊరికే రావు... సినిమా చూసేందుకు ప్రేక్షకుడు ఖర్చు చేసిన గంటలు కూడా తిరిగిరావు.

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

ఢిల్లీ డిక్లరేషన్‌పై మోదీ బడాయి

వినయ్ విశ్వం-సీపీఐ కార్యదర్శి

జీ-20 శిఖరాగ్ర సమావేశం ఉత్సవాల నిర్వహణతో సంవత్సరకాలంగా జరుగుతున్న ప్రచార ఆర్భాటం ముగిసింది. రానున్న లోకసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సామాజిక, రాజకీయ, దౌత్యపరమైన అంశాలుగల ప్రణాళికను రూపొందించుకొని ఒక పండగలాగా సమావేశాలను నిర్వహించారు. సహజంగానే జీ-20 ప్రకటిత లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సవాళ్లపై శ్రద్ధ వహించాలి. అయితే ప్రధాని మోదీ వీటిని పక్కనపెట్టి తనపేరు ప్రతిష్టలను పెంచుకునేందుకు కేంద్రీకరించి సమస్యలను నామమాత్రంగా ప్రస్తావించారు. అలాగే 2024లో జరగనున్న లోకసభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. జీ-20కి ప్రతిఏడాది ఒక దేశానికి అధ్యక్ష పదవి వస్తుంది. అయితే దీన్ని మోసపూరితంగా ఉపయోగించుకొని ఏదో సాధించినట్లు ఇంట, బైట ప్రచారం చేసుకున్నారు. మోదీ, ఆయన భక్తులు, భోక్తలు కలిసి 'విశ్వగురు' అని ప్రచారం సాగించారు. ఢిల్లీలో జరిగిన సమావేశాలకు ముందే దేశంలోని దాదాపు వంద ప్రధాన నగరాల్లో జీ-20 కి సంబంధించిన సమావేశాలు జరిపారు. వివిధ అంశాలపై జరిగిన సదస్సులకు 12,300 మంది ఆహ్వానించారు. ఈ సదస్సులను ఎవరికీ తెలియకుండానే జరిపారు. అత్యంత భారీగా అతిధులను ఆహ్వానించడానికి రూ.4,100కోట్లు ఖర్చయినట్లు సంబంధితవర్గాలు తెలిపాయి. ఈ సదస్సులను సైతం ఆకర్షణీయమైన నినాదాలు ఇవ్వడం, ఆకట్టుకునే విధంగా సభలు జరపడం మాత్రమే మోదీకి ఇష్టం.

ఢిల్లీ సభలో 'ఒకే భూమి-ఒకే కుటుంబం-ఒకే భవిష్యత్తు' నినాదంఇచ్చి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ నినాదం ఎక్కువగా ఆకర్షిస్తుంది. అయితే ఇది ఆచరణీయం కాదు. ఫలితమూ ఉండదు. 1975లో కలిగిన చమురు సంక్షోభం తర్వాత జీ-7 సంస్థను స్థాపించారు. ఇదివిస్తరించి జీ-20గా మారింది. సంక్షోభం కారణంగా ఎక్కువగా నష్టపోకుండా సొంత మార్గాలను అనుసరించేందుకు ప్రధానార్థిక వ్యవస్థలున్న దేశాలు ప్రయత్నించాయి. భౌగోళిక, రాజకీయ పరిణామాల నేపథ్యంలో అభివృద్ధి చెందుతున్న దేశాల ఆకాంక్షలను అంతర్జాతీయ అజెండా ముందుకు రావడంతో జీ-7 గ్రూపు జీ-20గా ఆవిర్భవించింది. తప్పనిసరై ఈ మార్పు జరిగింది. అయితే జీ-20 సమావేశాల్లో ప్రతి అంశంపై జరిగిన చర్చల్లో అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందని దేశాల ప్రయోజనాల మధ్య సంఘర్షణ జరిగింది. ఢిల్లీ సభకూడా ఇందుకు మినహాయింపుకాదు. ఢిల్లీ సభల్లో చర్చలను, డిక్లరేషన్‌ను నిశితంగా పరిశీలిస్తే జీ-7దేశాల పత్తిళ్లు బైటపడనున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యస్థిరత్వం, వాతావరణ మార్పులు, సుస్థిర అభివృద్ధిలాంటి అంశాలపై

లోతుగా చర్చలు జరగలేదు. ఉక్రెయిన్-రష్యాల యుద్ధం అంశం విపులంగా చర్చించి డిక్లరేషన్‌లో చేర్చకుండా జీ-7 దేశాలు (ధనిక) వదిలేశాయి. అత్యంత కీలకమైన వాతావరణమార్పులు, సుస్థిర అభివృద్ధి, పెరుగుతున్న ప్రపంచ భూతాపం, వలసలపై చర్చను పెద్దగా పట్టించుకోలేదు. మీడియా కూడా దృష్టిపెట్టలేదు. తమ జీవనంపైన జీ-20 శిఖరాగ్ర సమావేశం ప్రభావం ఎలా ఉంటుందని అర్థం చేసుకోవాలని భారతదేశ ప్రజలు ఎదురు చూస్తున్నారు. బీజేపీ పాలనలో అటవీసంపద, సహజ వనరులను కొద్దిమంది కార్పొరేట్లు చట్టబద్ధంగా లూటీ చేసేందుకు అవకాశం కలిగింది. తనకు ఎంతో ఇష్టంగా ఉందని ప్రజలు అనుకునే జీవ ఇంధన ప్రాజెక్టును అలయన్స్ ఆకాశానికి ఎత్తేందుకు ప్రధాని మోదీ ప్రయత్నించారు. ఈ ప్రాజెక్టు ఎలాంటి మార్పును, అమలును తీసుకుంటుందోగానీ మోదీ మాత్రం పెద్ద ఆర్భాటంగా వాగ్దానాలు చేశారు. అయితే అవన్నీ వాగ్దానాలుగానే మిగిలిపోయాయి. కొన్ని సంవత్సరాలక్రితమే సౌర విద్యుత్తు ఉత్పత్తి అలయన్స్‌ను ప్రకటించారుగానీ ఇంతవరకు అది ఆచరణలోకి రాలేదు.

పారదర్శకతలేని ఎవరికీ తెలియజేయకుండా ఉండటం మోదీ పాలన లక్షణాలు. అంతర్జాతీయ శిఖరాగ్ర సమావేశానికి భారతదేశ ప్రజలు కట్టేపన్నులు భారీగా ఖర్చుపెట్టారేగానీ, జవాబుదారీతనం ఏమాత్రం లేదు. మోదీ ఇతర దేశాల నాయకులతో ఫొటోలు తీయించుకున్న దానికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రాజెక్టులపై చర్చకు ఇవ్వలేదు. పత్రికా విలేకరులతో మాట్లాడేందుకే ప్రయత్నించలేదు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ విలేకరులతో మాట్లాడేందుకు యత్నించినప్పటికీ మోదీ అలా జరగకుండా చూశారు. బైడెన్ కోరినప్పటికీ మోదీ తిరస్కరించారు. అంతర్జాతీయ విలేకరులుగానీ, దేశీయ విలేకరులుగానీ బైడెన్ చేప్పేది వినడానికి ఆసక్తి చూపించారు. అయితే బైడెన్ వియత్నాంలో మాట్లాడుతూ, భారతదేశంలో మానవహక్కులను గురించి, భారత ప్రజల స్పందన, దేశాభివృద్ధి, పత్రికా స్వేచ్ఛ అంశాలపై మోదీని ప్రశ్నించానని చెప్పారు. అంటే మన దేశంలో మాట్లాడేందుకు బైడెన్‌కు అవకాశమే ఇవ్వలేదంటే మోదీ పాలనలో ఏ స్వేచ్ఛా లేదని అర్థంచేసుకోవాలి. అమెరికాలోనూ మానవహక్కుల సమస్య ఎక్కువగానే ఉన్నదని బాగా ప్రచారమైంది. మణిపూర్‌లో మూడునెలలకు పైగా అంతర్యుద్ధంలాంటి పరస్పర దాడులు, గృహదహనాలు, మహిళలను వస్త్రరహితంచేసి అవమానించడం తదితర అంశాలపైన మానవ హక్కులను ఉల్లంఘించారని అక్కడ పరిస్థితిని నియంత్రించేందుకు అవసరమైతే తాము సహాయం చేస్తామని అమెరికా వ్యాఖ్యానించింది. అయితే ప్రభుత్వ అనుకూల పత్రికలు, మీడియా ఈ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు. మోదీ మాత్రం ఈ విషయాలను పట్టించుకోకుండా "విశ్వగురు" ప్రచారం చేయించుకునేందుకు ప్రాధాన్యతన నిచ్చారు. విశ్వగురు ఇతరులను ఎలా ఆదరించాలో అనే అంశాన్నికూడా ఆయన పట్టించుకోలేదు. పశ్చిమదేశాల నాయకులను ప్రశంసించేందుకు ఢిల్లీ డిక్లరేషన్ ప్రయత్నించింది. అలాగే రష్యా, చైనా నాయకులు హాజరుకాకపోయినా వారిపై విమర్శలను దాదాపు మినహాయించింది. ప్రపంచాన్ని కాపాడేందుకు తూతూమంత్రంగా పరిష్కారాలను డిక్లరేషన్‌లో గుర్తించారు. డిక్లరేషన్‌లోని 78వ పేజీలో అన్ని పార్టీలు "మత, సాంస్కతిక వైవిధ్యానికి, చర్చలకు, సహనాన్ని" మరింతగా పెంపొందించాలని విజ్ఞప్తి చేశాయి. ప్రధానమంత్రిని నియంత్రిస్తున్న ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకత్వం నిరంతరం వైవిధ్యంపైన, చర్చలపైన, సహనంపైన ద్వేషం వెళ్లగక్కుతూ ఉన్నఅంశాన్ని ప్రజలు గుర్తించాలి.

మోదీ ఆయన వందిమాగధులు మాట్లాడేమాటలు 'విశ్వగురు' జీ20 శిఖరాగ్రసభను నిర్వహణలో చేసిన ఆర్భాటపు ప్రచారం పరీక్షకు నిలవాలి. ఆయన మైనారిటీలను లక్ష్యంగా చేస్తున్న అంశం అందరికీ తెలిసిందే. ధరించిన దుస్తులను చూసి దాడులు జరిపేవారిగా గుర్తించవచ్చునని మాట్లాడి అవమాన పరిచారు. అన్నిరకాల చర్చలు జరగకుండా మోదీ ప్రభుత్వం క్రియాశీలకంగానే పనిచేస్తున్నది. చివరకు పార్లమెంటులోనూ చర్చలను నిరోధిస్తూ ప్రభుత్వాన్ని విమర్శించినవారిని శిక్షకు గురిచేస్తున్నారు. తన ప్రభుత్వాన్ని కొనసాగించేందుకు అలాగే సమాజంలో అసహనం పెంచేందుకు ఒక పద్ధతిప్రకారం పనిచేస్తున్నారు. విశ్వగురు ప్రచారానికి ఆచరణాత్మక కార్యాచరణను గీటురాయిగా తీసుకోవాలి. ఈ విషయంలో 56 అంగుళాల ఛాతీగల నాయకుడు ప్రజల దృష్టిలో విఫలమైనట్టే.

విమోచనం కాదు- ప్రజలకు విద్రోహం!

బొల్లిముంత సాంబశివరావు

తెలంగాణలో మూడు నెలల్లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో గెలుపు కోసం వివిధ రాజకీయ పార్టీలు అంది వచ్చిన అవకాశాలను సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. తెలంగాణ విముక్తి అనే పేరుతో ఉత్సవాల నిర్వహణకు మేమంటే మేమని పోటీ పడుతున్నారు. ఈ ఉత్సవాలు నైజాం దోపిడీ అణచివేత బంధనాలనుంచి ప్రజలను విముక్తి చేయటానికి రైతాంగ సాయుధ పోరాటం గురించి కాదు. రైతాంగ పోరాటంపై అతి క్రూరంగా అణచివేతను ప్రారంభించి, నైజాం నవాబుని, జాగీర్దార్లను, భూస్వాములను రక్షించటానికి నెహ్రూ, పటేల్‌లను తెలంగాణ విముక్తి ప్రదాతలగా కీర్తించటానికి బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీ పడుతున్నాయన్న అంశాన్ని నేటి యువత అర్థం చేసుకోవాలి.

భారత రైతాంగ ఉద్యమ చరిత్రలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. నైజాం నిరంకుశ పాలనకు, జమీందారీ విధానానికి వ్యతిరేకంగా భూమికోసం, విముక్తి కోసం తెలంగాణ ప్రజల జరిపిన పోరాటం అది. ఈ పోరాట ప్రాముఖ్యత నేటి తరం తెలుసుకోకుండా పాలక పార్టీలన్నీ విమోచన నాటకాన్ని తెరమీదకు తెస్తున్నాయి. నైజాం నవాబు ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎట్టి హక్కులు లేకుండా, వెట్టిచాకిరిచేస్తూ, దారుణ దోపిడీకి గురౌతున్న సమయంలో ఆంధ్ర మహాసభ ఏర్పడింది. మొదట భాషోద్యమం కోసం సంఘం కృషి చేసింది. 1940లో మితవాద నాయకత్వం నుండి ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టుల నాయకత్వంలోకి వచ్చింది. అప్పటినుంచి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యక్ష కార్యాచరణ చేపట్టింది. వెట్టి చాకిరిరద్దు, కౌలు తగ్గింపు, దున్నే వానికే భూమిపై హక్కుల డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. సంఘంలోకి ప్రజలు పెద్ద ఎత్తున వచ్చి సంఘటితమయ్యారు. నీ బాంచన్ దొర అన్న పేదప్రజల కమ్యూనిస్టు పార్టీ కలిగించిన చైతన్యంతో జమీందార్ల, దేశ్‌ముఖ్‌ల, భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలను ఎదిరించసాగారు. వెట్టి చాకిరిని వ్యతిరేకించారు. భూమికోసం పోరు ప్రారంభమైంది. జమీందార్ల, దేశ్‌ముఖ్‌ల గుండెల్లో వణుకు పుట్టింది. ఆంధ్ర మహాసభ ప్రతి గ్రామానికి విస్తరించింది. సభలు, సమావేశాలతో మారు మోగింది. తన భూమి, పంట రక్షణ కోసం చాకలి ఐలమ్మ ప్రదర్శించిన తెగువ భూ పోరాట ప్రధాన్యతను ముందుకు తెచ్చింది.

జనగామ తాలూక కడివెండి గ్రామంలో దేశ్‌ముఖ్ విసునూరి రామచంద్రారెడ్డి గుండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమురయ్య అమరత్వంతో పోరాటం కొత్తమలుపు తీసుకున్నది. దేశ్‌ముఖ్‌ల, జమీందార్ల దాడులను సాయుధంగా ప్రతిఘటన చేయాలని కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం



తీసుకుంది. రైతాంగ ఉద్యమంపై నిజాం నవాబు ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగించింది. నిజాం రజాకార్లు ప్రజలపై పాశవిక దాడులు చేశారు. కమ్యూనిస్టుపార్టీ నాయకత్వాన ఈ దాడులను తిప్పికొట్టేందుకు గెరిల్లా దళాలు ఏర్పడ్డాయి. నిజాం సైన్యాలను, రజాకార్లను దెబ్బమీద దెబ్బగొట్టి విజయపరంపరలను కొనసాగించాయి. పోరాటం ద్వారా పదిలక్షల ఎకరాల భూములు ప్రజలు స్వాధీనపర్చుకుని సాగుచేశారు. వేలాది గ్రామల్లో గ్రామ రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రజాశక్తికి భయపడి జమీందార్లు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్లు, పట్టణాలకు పారిపోయారు. నిజాం నిరంకుశ ప్రభుత్వం రైతాంగ పోరాటంపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది.

రజాకార్లు గ్రామాలపై జుగుప్సాకరమైన దాడులు చేశారు. రైతాంగ పోరాట ప్రాంతంలో ప్రతి నాలుగుమైళ్లకు మిలటరీక్యాంపు పెట్టి గ్రామాలపై దాడులు సాగించింది. తీవ్ర చిత్రహింసలకు గురిచేసింది. ప్రజలను ఒకేచోట మందవేసి పాశవికంగా హింసించారు. స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. పచ్చి బాలింతలను కూడా వదిలిపెట్టలేదు. ఇనుప పట్కార్లతో స్త్రీల రొమ్ముల పట్టి లాగటం, తల్లుల ఎదుటే పిల్లలను చంపటం జరిగింది. ఎంత నిర్బంధం ప్రయోగించినా రైతాంగ సాయుధ పోరాట విస్తరణను నిజాం ప్రభుత్వం ఆపలేకపోయింది. రైతాంగ సాయుధ పోరాటాన్ని అడ్డుకునే శక్తి నిజాం నిరంకుశ ప్రభుత్వ కోల్పోయింది. మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నెహ్రూ ప్రభుత్వ వెన్నులో వణుకు పుట్టించింది. నైజాం సైన్యాలు, రజాకార్లు కమ్యూనిస్టుల నాయకత్వాన సాగుతున్న ప్రజాఉద్యమాన్ని ఎదుర్కోలేక పోతున్నారని గ్రహించి, ఉద్యమం కొనసాగితే కమ్యూనిస్టుల ప్రాబల్యం పెరిగి ఇతర ప్రాంతాల్లో కూడా ఉద్యమాలు ప్రారంభమౌతాయని నెహ్రూ ప్రభుత్వం భయపడింది. ఉద్యమాన్ని అణచివేసే బాధ్యత ప్రత్యక్షంగా చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఉద్యమం ఇతర ప్రాంతాలకు విస్తరించటం అత్యంత ప్రమాదకరని భావించింది. 13-9-1948న హైద్రబాద్ సంస్థానానికి సైన్యాలను పంపింది. నిజాం సైన్యాలు బూటకపు ప్రతిఘటన నాటకమాడి రెండు రోజుల్లోనే నైజాం రాజు లొంగిపోయినట్లు ప్రకటించి, నెహ్రూ సైన్యాలకు స్వాగతం పలికాడు. దీన్నిగమనిస్తే ముందుగానే సైనిక చర్యగురించి నెహ్రూ ప్రభుత్వానికి, నైజాం నవాబు మధ్య ఒప్పందం జరిగిందనే అవగాహన ఉందని వెల్లడౌతుంది. నిజాం నవాబును గద్దెదింపటానికే సైన్యం వస్తే, మరి నవాబును (రాజుని) అరెస్టుచేసి నిర్బంధించాలి. కాని అలా జరగలేదు. రాజ్య ప్రముఖుడిగా నిజాం రాజుని ప్రకటించి 1950 జనవరి 26 వరకు నైజాం ప్రాంతాన్ని అతని పాలనలోనే ఉంచి, నెహ్రూ ప్రభుత్వం 17-9-1950లో భారత యూనియన్‌లో విలీనంచేసింది. ఈ క్రమంలో గ్రామాలకు సైన్యాలను పంపి ప్రజలు సాగు చేసుకుంటున్న భూములను జమీందార్లకు, భూస్వాములకు అప్పగించింది. దీన్ని గమనిస్తే నైజాం నవాబును, జమీందారీ, జాగీర్దారులను, భూస్వాములను రక్షించటానికే రైతాంగ సాయుధ పోరాటంపైకి మిలటరీదాడి అన్నది స్పష్టమౌతున్నది. అందుకు అనుగుణంగానే పెద్దఎత్తున నిజాం రాజ్యంలో సైన్యాన్నిదింపి రైతాంగ పోరాటంపై విరుచుకుపడింది. నిర్బంధ క్యాంపులు పెట్టి ప్రజలను తీవ్ర చిత్ర హింసలకు గురిచేసింది. కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది. నాయకులను, కార్యకర్తలను పట్టుకుని కాల్చి చంపింది. నాలుగు వేలమంది కమ్యూనిస్టు ముద్దు బిడ్డలను, మరో రెండువేలమంది ప్రజలను నెహ్రూ ప్రభుత్వం పొట్టన పెట్టుకుంది. వేలాదిమందిపై కేసులు బనా యించడమైంది. తెలంగాణ పోలీసురాజ్యంగా మారింది. రైతాంగ పోరాటానికి భయపడి పట్టణాలకు పారిపోయిన జాగీర్దార్లు, జమీందార్లు మిలటరీ రక్షణలో తిరిగి గ్రామాలకు వచ్చి బీభత్సం సృష్టించారు. 17-9-1948లో నెహ్రూ సైన్యాలు చేసింది తెలంగాణ విముక్తి కాదు, జాగీర్దార్లను, దేశ్‌ముఖ్‌లను, భూస్వాములను రైతాంగ ఉద్యమం నుంచి రక్షించ టానికేననేది స్పష్టం. ఇది నెహ్రూ ప్రభుత్వం చేసిన ప్రజాద్రోహం. నెహ్రూ ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించినా రైతాంగ సాయుధ పోరాటం కొనసాగింది. పార్టీలో చోటుచేసుకున్న మితవాద, అతివాద ధోరణులను 1951, అక్టోబర్ 31 మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం విరమణకు కారణమైంది. మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని నిర్మించింది కమ్యూనిస్టు పార్టీ అందుకు అనేక త్యాగాలు చేసింది కమ్యూనిస్టు పార్టీనే. అందువలన ఆ పోరాట వారసులు కమ్యూనిస్టులే. ఇతరులు దాన్ని ఉచ్చరించటానికి కూడా హక్కులేదు. ఇప్పుడు విద్రోహ కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వ్యతిరేక పార్టీలైన బీజేపీ, భారత రాష్ట్ర సమితి, మజ్లిస్ పార్టీలు సెప్టెంబర్ 17ని తెలంగాణ విమోచన దినోత్సవంగా పాటిస్తామని, ఉత్సవాలు జరుపుతామని, అందుకు వారసులం మేమంటే మేమని పోటీ పడుతున్నాయి. ఆ రోజు జరిగిన విద్రోహం వలన ప్రజావ్యతిరేక దోపిడీ పాలకులు పాలన సాగించాయి, సాగిస్తున్నాయి. అందుకే ఈ మూడు పార్టీలు విద్రోహదిన వారసత్వం కోసం పోటీ పడుతున్నాయి. దీన్ని దేశ ప్రజలు ముఖ్యంగా తెలంగాణ ప్రజలు గ్రహించాలి. 17-9-50న జరిగినది విమోచనం కాదు, ప్రజలకు విద్రోహ దినమని ప్రజలు గొంతువిప్పాలి. తెలంగాణ పోరాట వారసులు కమ్యూనిస్టులేనని నినదించాలి.

సెల్: 9885983526

బీజేపీని కుదిపేస్తున్న టికెట్ల స్కాం

వెలుగులోకి సంచలన విషయాలు

పరారీలో స్వామీజీ... అరెస్టుకు నిందితురాలి డిమాండ్

బెంగళూరు: కర్ణాటకలో టికెట్ స్కాం బీజేపీని కుదిపేస్తోంది. ఈ కుంభకోణానికి సంబంధించి దిగ్భ్రాంతి కలిగించే విషయాలు బయటకు వస్తున్నాయి. ఈ కుంభకోణంలో ఆ పార్టీ పెద్దల హస్తం ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఆరెస్సెస్ నేతలు, స్వామీజీలు కూడా అందులో కీలకంగా వ్యవహరించారని తెలుస్తున్నది. ముడుపులు తీసుకోవడంలో కీలకంగా వ్యవహరించిన హిరేహడగలి మఠానికి చెందిన అభినవ హాలశ్రీ స్వామీజీ పరారీలో ఉన్నారు.

ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ టికెట్ల కేసులో అరెస్టయిన ప్రధాన నిందితురాలు, హిందూ కార్యకర్త చైత్ర కుందాపుర తాజాగా సంచలన విషయాలు బయటపెట్టారు. టికెట్ల స్కామ్ వెనుక పెద్దలు ఉన్నారని, స్వామీజీని అరెస్టు చేస్తే అన్ని విషయాలు బయటపడతాయని ఆమె పేర్కొనడం సంచలనంగా మారింది. బెంగళూరులోని సిటీ సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (సీసీబీ) కార్యాలయం వద్ద గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. 'టికెట్ల స్కామ్ వెనుక పెద్దల హస్తం ఉంది. స్వామీజీని అరెస్టు చేస్తే అన్ని విషయాలు బయటపడతాయి. నిజానిజాలు తెలుస్తాయి' అని ఆమె చెప్పారు. ఈ కుంభకోణంలో ప్రధాన నిందితురాలిగా ఉన్న చైత్రను మంగళవారం ఉడిపిలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెతో పాటు మరో ఆరుగురిని అరెస్టు చేశారు. ఇటీవల ముగిసిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో 72 కొత్తముఖాలకు బీజేపీ టికెట్లు ఇచ్చింది. టికెట్లు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది నుంచి రూ.5 కోట్ల వరకు ముడుపులు తీసుకున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. టికెట్ ఇప్పిస్తామని నమ్మబలికి తన వద్దనుంచి రూ.5 కోట్లు తీసుకున్నట్టు పారిశ్రామికవేత్త గోవిందబాబు పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ప్రధాన నిందితురాలు చైత్ర గోవిందబాబును స్వామీజీ వద్దకు తీసుకెళ్లగా ఆయన తనకు ప్రధాని నరేంద్రమోదీతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని నమ్మించారు. దీంతో ఆ పారిశ్రామికవేత్త స్వామీజీకి రూ.1.5 కోట్లు అందజేశారు. ఎన్నికల్లో ఆయనకు టికెట్ రాకపోవడంతో తాను ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వాలని చైత్రను కోరగా 'నీ ఆదాయ వనరులకు సంబంధించిన వివరాలను దర్యాప్తు సంస్థలకు అందిస్తాను' అని ఆమె గోవిందబాబును బెదిరించారు. దీంతో ఆయన పోలీసులను ఆశ్రయించారు.

నూహ్ అల్లర్ల కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్

నూహ్: హరియాణాలోని నూహ్ జిల్లాలో చెలరేగిన హింసాకాండకు సంబంధించిన కేసులో కాంగ్రెస్ ఎమ్మెల్యే మమ్మన్ ఖాన్‌ను పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. జులై 31న హిందూ సంస్థ నిర్వహించిన ఊరేగింపు సందర్భంగా నుహ్‌లో మత ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. యాత్ర అనంతరం చెలరేగిన హింసలో కాంగ్రెస్ ఎమ్మెల్యే హస్తం ఉందని హరియాణా పోలీసులు తెలిపారు. గురువారం అర్ధరాత్రి సమయంలో ఎమ్మెల్యేని అదుపులోకి తీసుకున్నట్లు ఫిరోజ్‌పూర్ జిర్కా డీఎస్పీ సతీశ్ కుమార్ శుక్రవారం వెల్లడించారు. అన్ని సాక్ష్యాధారాలను పరిశీలించాకే ఎమ్మెల్యేను నిందితుడిగా పేర్కొన్నట్లు హరియాణా పోలీసులు కోర్టుకు తెలిపారు. ఫోన్‌కాల్ రికార్డులు, ఇతర ఆధారాలు తమ వద్ద ఉన్నట్లు చెప్పారు. అంతకుముందు విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్యేకు నుహ్ పోలీసులు రెండుసార్లు సమన్లు పంపారు. ఇతర కారణాలు చెప్పి ఆయన విచారణకు హాజరు కాలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేని తాజాగా పోలీసులు అరెస్ట్ చేశారు. మమ్మన్ ఖాన్ ప్రస్తుతం ఫిరోజ్‌పూర్ జిర్కా అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తన అరెస్ట్‌ను ముందే ఊహించిన మమ్మన్ ఖాన్ ముందస్తు బెయిల్ కోసం పంజాబ్- హర్యానా హైకోర్టులో మంగళవారం బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. హింస చెలరేగిన రోజున తాను నుహ్‌లో లేనని, తనను ఈ కేసులో అన్యాయంగా ఇరికించారని ఆ పిటిషన్‌లో మమ్మన్ ఖాన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బెయిల్ పిటిషన్‌పై విచారణ అక్టోబర్ 19న జరగనుంది. ఈ అల్లర్లలో ఆరుగురు మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ ఘర్షణలకు సంబంధించి ఇప్పటి వరకు పోలీసులు 100 మందికిపైనే అరెస్ట్ చేశారు.

ఉత్తరాఖండ్‌లో మోదీ పర్యటనకు సన్నాహాలు

పితోర్‌గఢ్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెలలో ఇక్కడ జోలింగ్‌కాంగ్, ఆది కైలాశ్ వ్యూపాయింట్‌లలో ప్రతిపాదిత పర్యటనకు సన్నాహాలు ప్రారంభించినట్లు అధికారులు శుక్రవారం తెలిపారు. 'అక్టోబరు 11, 12 తేదీల్లో ఈ జిల్లాలో ప్రధాన మంత్రి తాత్కాలిక పర్యటన గురించి తెలియజేసిన తర్వాత మేము ఇతర సంస్థలతో కలిసి సన్నాహాలు ప్రారంభించాము' అని పితోర్‌గఢ్ జిల్లా మేజిస్ట్రేట్ రీనా జోషి చెప్పారు. తాత్కాలిక ప్రయాణ ప్రణాళిక ప్రకారం, ప్రధాన మంత్రి అక్టోబరు 11న ధార్చుల సబ్-డివిజన్‌లోని వ్యాస్ వ్యాలీలోని గుంజి హెలిప్యాడ్‌కు చేరుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత గుంజికి 36 కిలోమీటర్ల దూరంలోని జోలింగ్‌కాంగ్‌లోని శివాలయంలో ఆయన పూజలు చేస్తారు. ప్రధాన మంత్రి ప్రతిపాదిత సందర్శన దృష్ట్యా ఐటీబీపీ హెలిప్యాడ్ నుంచి ఆలయం వరకు అర కిలోమీటరు పొడవునా రహదారిని నిర్మించే బాధ్యతను తమకు అప్పగించినట్లు బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ అధికారి తెలిపారు. దాదాపు 19,505 అడుగుల ఎత్తులో ఉన్న శివాలయం నుంచి ఆది కైలాశ్ వ్యూపాయింట్ వరకు రెండు కిలోమీటర్ల రహదారిని సైన్యం నిర్మిస్తుందని ఆయన చెప్పారు. 'ప్రధాని ఆది కైలాశ్ వ్యూపాయింట్ వద్ద ఒక గంట గడిపే అవకాశం ఉంది' అని అధికారి వివరించారు. అక్టోబరు 12న పితోర్‌గఢ్ పట్టణంలోని వాల్దియా స్టేడియంలో జరిగే బహిరంగ ర్యాలీలో కూడా ప్రధాని ప్రసంగించే అవకాశం ఉందని బీజేపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు మహేంద్ర భట్ తెలిపారు.

అత్యాచార ఘటనపై సిట్ దర్యాప్తు

సీఎం నితీశ్‌కు లేఖ రాసిన డీసీడబ్ల్యూ చీఫ్ మలివాల్

న్యూఢిల్లీ : సహర్సాలోని స్కూల్‌లో విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనను దర్యాప్తు చేసేందుకు సిట్‌ను ఏర్పాటు చేయాలని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ చేపట్టాలని డీసీడబ్ల్యూ అధ్యక్షురాలు స్వాతి మలివాల్ గురువారం బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను కోరారు. ఈ సంఘటనపై 'కఠినమైన దర్యాప్తు' జరపాలని నితీశ్‌కు రాసిన లేఖలో ఆమె విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితురాలికి న్యాయ సహాయం, నష్టపరిహారం అందించాలని కోరారు. 'తీవ్ర బాధ కలిగించే' సంఘటనకు సంబంధించి డీసీడబ్ల్యూకి ఫిర్యాదు అందిందని మలివాల్ చెప్పారు. 'పాఠశాల మేనేజర్‌కు చెందిన 30 ఏళ్ల కుమారుడు రెండేళ్లుగా పాఠశాలలోనే బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, నిందితుడు బాలికను వీడియో తీసి బ్లాక్ మెయిల్ చేశాడని కూడా ఆరోపణ వచ్చింది' అని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. పాఠశాల మహిళా ప్రిన్సిపాల్ నేరం చేయడంలో నిందితులకు క్రమం తప్పకుండా సహకరించిందని ఫిర్యాదుదారు ఆరోపించారని మలివాల్ చెప్పారు. 'ఈ విషయంలో ఎఫ్‌ఐఆర్ నమోదయింది. నిందితులను అరెస్టు చేశారు. అయితే, ఇప్పటి వరకు బీహార్ ప్రభుత్వం నుంచి ఎవరూ తనను కలవలేదని బాధితురాలు కమిషన్‌కు తెలిపింది. 'మరింత న్యాయ సహాయం, పరిహారం ఆమెకు అందాల్సి ఉంది. అలాగే, ఈ విషయంలో దర్యాప్తు జరుగుతున్న తీరుపై బాధితురాలి కుటుంబం ఆందోళన చెందుతుంది. హృదయాన్ని కదిలించే సంఘటన ఆ విద్యార్థినికి 'తీవ్రమైన బాధ కలిగించింది' అని పేర్కొన్న మలివాల్, 'కఠినమైన, సమగ్ర దర్యాప్తు' జరిగేలా సిట్ చేత దర్యాప్తు చేయించాలని ముఖ్యమంత్రిని కోరారు. 'బాధితురాలికి సహాయం చేయడానికి ప్రభుత్వం ఈ కేసులో ప్రత్యేక ప్రాసిక్యూటర్‌ను నియమించాలి. దీనిని ఫాస్ట్ ట్రాక్ కోర్టులో అత్యవసరంగా విచారణ చేయాలి' అని డీసీడబ్ల్యూ తెలిపింది. బాధితురాలు తన గాయాన్ని అధిగమించడానికి ఆమెకు తగిన పరిహారం అందేలా చూడటం రాష్ట్ర విధి అని మలివాల్ అన్నారు. సరైన వైద్య చికిత్స, పునరావాసం కూడా రాష్ట్రం అందించాలని, ప్రభుత్వం నుంచి ఒక సీనియర్ ప్రతినిధి బాధిత కుటుంబాన్ని అత్యవసరంగా కలుసుకొని అన్ని విధాలుగా వారికి సహాయం చేయాలని ఆమె లేఖలో పేర్కొంది.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో సిద్ధరామయ్య

బెంగళూరు: అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంలో భాగంగా కర్నాటక ప్రభుత్వం శుక్రవారం రాజ్యాంగ పీఠిక పఠనానికి సంబంధించిన భారీ కార్యక్రమం నిర్వహించింది. ఇందులో భారత్‌తో పాటు విదేశాలకు చెందిన లక్షలాదిమంది పాల్గొన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర ముఖ్య అతిథుల నేతృత్వాన విధానసౌధలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రాజ్యాంగంలో పొందుపరిచిన పీఠికను చదివి...అందరితో చదివించారు. పెద్దసంఖ్యలో పాఠశాల విద్యార్థులు, ఇతరులు పాల్గొన్నారు. ప్రతిరోజు రాజ్యాంగ పీఠిక తప్పనిసరిగా చదవాలని ప్రైవేట్, ప్రభుత్వ అనే దానితో సంబంధం లేకుండా అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను కర్నాటక ప్రభుత్వం జూన్‌లో ఆదేశించింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ పీఠికను అందుబాటులో ఉంచాలని స్పష్టంచేసింది. సిద్ధరామయ్య మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఐదు హామీలలో ఇప్పటికే నాలుగు అమలు చేశామని, ఆ పథకాలపై చర్చ జరుగుతోందని చెప్పారు. 'రాజ్యాంగ పరిరక్షణ ప్రతిపౌరుడి బాధ్యత. మనమంతా భారతీయులమని రాజ్యాంగం స్పష్టంచేస్తోంది. రాజ్యాంగ ఆకాంక్షలను సక్రమంగా అవగాహన చేసుకోలేకపోయినా...అమలు చేయకపోయినా సమసమాజ నిర్మాణం అసాధ్యం' అని సిద్ధరామయ్య చెప్పారు. సమసమాజం, లౌకిక సూత్రాలు రాజ్యాంగం కల్పించిన హక్కులని తెలిపారు. ప్రజల జీవితాలు మెరుగుపరిచే లక్ష్యంతో తమ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. రాజ్యాంగం పేర్కొన్న సమసమాజం, లౌకిక సూత్రాల ఆధారంగా తమ ప్రభుత్వం కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. రాజ్యాంగ విధ్వంసానికి, మనుస్మృతి అమలుకు రాజ్యాంగేతర శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దీనిపట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మనుస్మృతి అమలులోకి వస్తే 90శాతం భారతీయులు తిరిగి బానిసత్వంలోకి వెళ్లకతప్పదని హెచ్చరించారు. ఇందుకోసం పెద్దఎత్తున కుట్రలు జరుగుతున్నాయన్నారు.

సనాతన ధర్మం పాఠాలు అవసరం లేదు: కమల్‌నాథ్

భోపాల్: అన్ని మతాలకు భారత్ నిలయమని, ఇతరుల విశ్వాసాలను పక్కన పెట్టి ఏ ఒక్కరికీ సనాతన ధర్మం గురించి పాఠాలు చెప్పాల్సిన అవసరం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ శుక్రవారం స్పష్టంచేశారు. సనాతన ధర్మను అంతం చేసేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి ప్రయత్నిస్తోందని ప్రధాని మోదీ విమర్శలు గుప్పించిన మరుసటి రోజు కమల్‌నాథ్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారతదేశాన్ని, వేల ఏళ్లనాటి దేశ సంస్కృతిని నిర్మూలించాలని ఇండియా పార్టీలు కోరుకుంటున్నాయని మోదీ ఎదురుదాడి చేశారు. దీనికి ప్రతిస్పందనగా కమల్‌నాథ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'సనాతన ధర్మాన్ని మనమంతా ఆమోదిస్తాం. దీని గురించి ఎవరికీ ప్రత్యేకంగా చెప్పాల్సిన, అవగాహన కల్పించాల్సిన అవసరం లేదు. సనాతన ధర్మానికి భారత్ నిలయం' అని కమల్‌నాథ్ చెప్పారు. సనాతన ధర్మం మలేరియా, డెంగ్యూ వంటిదని పేర్కొంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు దుమారం రేపిన విషయం విదితమే. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని ఉదయనిధి పిలుపునిచ్చారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ టికెట్ల పంపిణీపై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ రాష్ట్ర పార్టీ ఆమోదం లేకుండా ఇతర పార్టీలకు ప్రవేశమే లేదని కమల్‌నాథ్ స్పష్టంచేశారు. రాష్ట్ర పార్టీ, ఏఐసీసీ నిర్వహించిన సర్వేల ఆధారంగానే టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. జ్యోతిరాదిత్య సింధియా గురించి అడుగగా 'సింధియా బీజేపీలో ఉన్నారు. కేంద్రమంత్రిగా పనిచేస్తున్నారు. తన భవిష్యత్‌ను ఆయనే నిర్ణయించుకున్నారు. ఇప్పుడు సింధియా భవిష్యత్‌ను బీజేపీ నిర్ణయిస్తుంది' అని తెలిపారు.

5 నుంచి బొగ్గు కార్మికుల సమ్మె

ధన్‌బాద్(జార్ఖండ్): వేతన చెల్లింపుల అంశంపై అక్టోబరు 5వ తేదీ నుంచి మూడురోజులు బొగ్గు కార్మికులు సమ్మె చేయనున్నట్లు భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) సహా ఐదు కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించాయి. ఈ మేరకు కోల్ ఇండియా ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేసినట్లు కార్మిక సంఘాలు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటనలో వెల్లడించాయి. రాంచిలో గురువారం జరిగిన కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధుల సమావేశంలో సమ్మెపై నిర్ణయం తీసుకున్నట్లు ఐఎన్‌టీయూసీ సీనియర్ ఉపాధ్యక్షుడు ఏకే ఝా తెలిపారు. సీఐఎల్, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్‌సీసీఎల్)లో పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది సెప్టెంబరు వేతనాలు ఎన్‌సీడబ్ల్యూఏ-11 ఒప్పందం ప్రకారం ఎన్‌సీడబ్ల్యూఏ-10 ప్రాతిపదికన చెల్లించాలని వినతిపత్రంలో డిమాండ్ చేశారు. జులై, ఆగస్టు వేతనాలు ఎన్‌సీడబ్ల్యూఏ-11 ప్రకారం చెల్లించారని ఝా వివరించారు. ఎన్‌సీడబ్ల్యూఏ-10 ప్రకారం అక్టోబరులో సకాలంలో వేతనాలు చెల్లించకపోతే 2.60 లక్షల మంది బొగ్గు కార్మికులు అక్టోబరు 5 నుంచి 7వ తేదీ వరకు సమ్మెలో పాల్గొంటారని హెచ్చరించారు.

కేరళలో 'నిఫా'తో కర్నాటక అప్రమత్తం

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

బెంగళూరు : పొరుగు రాష్ట్రంలో 'నిఫా' వ్యాప్తి నేపథ్యంలో కర్నాటక ప్రభుత్వం అప్రమత్తమయింది. మార్గదర్శకాలు జారీ చేసింది. కేరళలోని ప్రభావిత ప్రాంతానికి అనవసర ప్రయాణాన్ని నివారించడం, సరిహద్దు జిల్లాల్లో జ్వర పర్యవేక్షణను తీవ్రతరం చేయడం వంటివి ఉన్నాయి. ఆరోగ్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, అనుమానిత కేసులను నియంత్రించడానికి జిల్లా ఆస్పత్రుల్లో పడకలను సిద్ధంగా ఉంచడం వంటివి సూచించిన చర్యల్లో ఉన్నాయి. 'కేరళ రాష్ట్రంలోని కోజికోడ్ జిల్లాలో రెండు మరణాలతో నాలుగు ధ్రువీకరించిన నిఫా కేసులను నివేదించిన దృష్ట్యా, సంక్రమణ వ్యాప్తిని నిరోధించడానికి కేరళ సరిహద్దు జిల్లాలలో నిఘా కార్యకలాపాలను ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది' అని ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, ఆయుష్ సేవల కమిషనరేట్ సెప్టెంబరు 14న జారీ చేసిన ఉత్తర్వులు పేర్కొన్నాయి. తక్షణ సమ్మతి కోసం నిఘా కార్యకలాపాలను చేపట్టడానికి మార్గదర్శకాలను జారీ చేస్తూ, నిఫా వైరస్ వ్యాప్తిని అన్ని స్థాయిలలో నిరోధించడానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు తక్షణ చర్యలను ప్రారంభించాలని భావిస్తున్నట్లు తెలిపింది. కర్నాటక నుంచి కేరళలోని ప్రభావిత ప్రాంతానికి సామాన్య ప్రజల అనవసర రాకపోకలను నివారించడం, కేరళకు జిల్లాలు (చామరాజనగర, మైసూరు, కొడగు, దక్షిణ కన్నడ), కర్నాటకకు ప్రవేశించే ప్రదేశాలలో సరిహద్దులో ప్రవేశించే ప్రదేశంలో జ్వరాల నిఘా కోసం చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం, సరిహద్దుల్లో జ్వరాలపై నిఘాను తీవ్రతరం చేయడం వంటి తక్షణ చర్యలు సూచించింది. ఈ మార్గదర్శకాలలో ఏవైనా అనుమానిత కేసులు నమోదయితే వాటిని నియంత్రించడానికి జిల్లా ఆస్పత్రుల్లో కనీసం రెండు పడకలను గుర్తించడం, రిజర్వు చేయడం వంటివి ఉన్నాయి. ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, ఆక్సిజన్‌ను తగినంత నిల్వతో పాటు అనుమానిత కేసు నుంచి నమూనా సేకరణ, రవాణా కోసం ఇతర ఉపకరణాలు తగిన నిల్వ ఉండేలా చూసుకోవాలి. అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు అనుమానిత కేసును వెంటనే సంబంధిత జిల్లాలోని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారికి నివేదించాలని కోరారు. ఏవైనా అనుమానిత కేసుల నుంచి క్లినికల్ శాంపిల్‌ను సేకరించి, మార్గదర్శకాల ప్రకారం ఎన్ఐవీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ), పూణే ద్వారా ఎన్ఐవీ బెంగళూరుకు తక్షణమే రవాణా చేయడానికి ఏర్పాట్లు చేయాలని పేర్కొంది.

మహిళలకు నెలకు రూ.వెయ్యి

పథకం ప్రారంభించిన సీఎం ఎం.కె.స్టాలిన్

కాంచీపురం : తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వం మహిళలకు నెలకు రూ.1,000 ఆర్థిక సహాయ పథకాన్ని ద్రవిడ దిగ్గజం సి.ఎన్.అన్నాదురై జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం ఇక్కడ ప్రారంభించారు. మహిళల శ్రమకు గుర్తింపుగా ఈ పథకాన్ని ప్రారంభించిన స్టాలిన్, అనేక మంది లబ్ధిదారులకు బ్యాంకు డెబిట్ కార్డులను పంపిణీ చేయడంతో పాటు రాష్ట్ర మంత్రులు తమ జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్నా జయంతి రోజున, కరుణానిధి శత జయంతి (2023-24) సందర్భంగా ఈ పథకాన్ని ప్రారంభించడం గర్వించదగ్గ విషయమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ పథకం కింద ప్రభుత్వం 1.06 కోట్ల మంది మహిళలను లబ్ధిదారులుగా గుర్తించింది. ప్రత్యక్ష ప్రయోజన బదిలీ ద్వారా లబ్ధిదారులకు రూ.1,000 సహాయం చెల్లిస్తారు. అధికారికంగా ఈ పథకం 'కళైంజ్ఞర్ మగళిర్ ఉరిమై తిట్టం'... మహిళల హక్కు కోసం కలైంజర్ పథకం. డీఎంకే దివంగత నేత కరుణానిధి (1924-2018) ప్రముఖ కళాకారుడు అంటే కలైంజ్ఞర్ అని పిలుస్తారు. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు డీఎంకే మేనిఫెస్టోలో కీలకమైన ఈ పథకాన్ని అన్నాదురై జయంతి రోజు సెప్టెంబరు 15న ప్రారంభించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం నెలల క్రితం ప్రకటించింది. 1967లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో డీఎంకే తన మొట్టమొదటి ఘన విజయం సాధించేలా చేసిన అన్నాదురై సొంత పట్టణం కాంచీపురం. ఆయన 1967-1969 మధ్య తమిళనాడు ముఖ్యమంత్రిగా ఉన్నారు. అన్నాదురై 1949లో డీఎంకేను స్థాపించారు. రూ.1,000 నెలసరి సహాయం పొందేందుకు మహిళలు దరఖాస్తుల నమోదును సులభతరం చేసేందుకు ధర్మపురిలో జులైలో స్టాలిన్ శిబిరాన్ని ప్రారంభించారు. కోట్లాది మంది మహిళల జీవితాల్లో కొత్త పునరుజ్జీవనానికి దారితీసే ఈ పథకాన్ని విప్లవాత్మకమని స్టాలిన్ అభివర్ణించారు. సంవత్సరానికి రూ.12 వేల చెల్లింపు మహిళలకు గొప్ప మద్దతుగా, అభివృద్ధికి చిహ్నంగా ఉంటుందని, ఇది వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి, ఆత్మగౌరవంతో కూడిన జీవితాన్ని గడపడానికి, పేదరికాన్ని నిర్మూలించడానికి వారికి సహాయపడుతుందని ఆయన చెప్పారు. అన్నాదురై 115వ జయంతి సందర్భంగా పథకాన్ని ప్రారంభించే ముందు స్టాలిన్ ఇక్కడ ద్రవిడ మహానాయకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కొందరు దోషులకు 'అధిక ప్రయోజనాలు'

బిల్కిస్‌బానో కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ: కొంతమంది దోషులకు 'ఎక్కువ ప్రయోజనాలు' ఉంటుంటాయని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. గోధ్రా అల్లర్ల సమయంలో చోటుచేసుకున్న బిల్కిస్‌బానో సామూహిక అత్యాచారం, ఆమె కుటుంబంలోని ఏడుగురు వ్యక్తుల హత్యలో దోషులుగా ఉన్నవారిని ఖైదు నుంచి విడుదల చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. దోషుల్లో ఒకరైన రమేశ్ రూపాభాయ్ చందానా తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా హాజరయ్యారు. యావజ్జీవ శిక్ష పడినవారిలో పరివర్తన, పునరావాసం కోసం క్షమాభిక్ష ప్రసాదించడమనేది అంతర్జాతీయంగా అమల్లో ఉన్నదేనని, హేయమైన నేరం దృష్ట్యా అలా చేయడం కుదరదని బిల్కిస్‌బానో తదితరులు వాదించడం సబబు కాదని ఆయన పేర్కొన్నారు. కార్యనిర్వాహక వ్యవస్థ నుంచి నిర్ణయం వెలువడినందువల్ల ఇప్పుడు దానిని రద్దు చేయలేమని చెప్పారు. 'క్షమాభిక్ష విధానం గురించి మాకు తెలుసు. అది అందరూ ఆమోదించినదే. ఇక్కడ బాధితురాలు, ఇతరులు ప్రస్తుత కేసుకు దీనిని వర్తింపజేయడాన్ని ప్రశ్నిస్తున్నారు. క్షమాభిక్ష ప్రసాదించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన కేసుల్లో వెలువడిన తీర్పులను న్యాయస్థానానికి సమర్పించడంలో సహకరించండి' అని లూథ్రాకు ధర్మాసనం సూచించింది. సాధారణంగానైతే క్షమాభిక్ష ప్రసాదించకపోవడాన్ని వ్యతిరేకిస్తూ కేసులు దాఖలవుతుంటాయని తెలిపింది. కొందరు దోషులు ఇలాంటి ప్రయోజనాలు ఎక్కువగా పొందుతుంటారని పేర్కొంది. చట్టం, విధానం అందరికీ ఒకటేనని లూథ్రా చెప్పారు. చేసిన నేరం హేయమైనదనే విషయంపై వాదనల్ని న్యాయ విచారణ సమయంలో చేయవచ్చని, ప్రస్తుత దశలో అదీ దోషులు 15 ఏళ్లుగా జైల్లో ఉన్న తర్వాత ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించే వీల్లేదని స్పష్టంచేశారు. తదుపరి విచారణ ఈ నెల 20న జరగనుంది.

వాదించలేని జూనియర్‌ని పంపుతారా?

న్యాయవాదిపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: కేసు వాయిదా కోరడానికి తన స్థానంలో జూనియర్ న్యాయవాదిని పంపిన 'అడ్వొకేట్ ఆన్ రికార్డ్'పై దేశ అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. రూ.2 వేలు జరిమానా కట్టాలని ఆదేశించింది. సుప్రీంకోర్టులో కక్షిదారుల తరపున ప్రాతినిధ్యం వహించేందుకు, వారి తరపున కేసులు దాఖలు చేయడానికి అధికారం ఉన్న వకీలును 'అడ్వొకేట్ ఆన్ రికార్డ్' అంటారు. గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చిన ఒక కేసులో జూనియర్ న్యాయవాది హాజరయ్యారు. ప్రధాన న్యాయవాది అందుబాటులో లేరనీ, అందుకే తాను వచ్చాననీ, కేసును వాయిదా వేయాలని ఆయన కోరారు. దానితో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. "మీరు మమ్మల్ని ఇంత తేలికగా తీసుకోలేరు. న్యాయస్థానం నిర్వహణలో మౌలిక సదుపాయాల ఖర్చులు కూడా ఉంటాయి. మీరు వాదించండి" అని తెలిపింది. కేసు వివరాలు తనకు తెలియవనీ, ఈ అంశంపై వాదనలు చేయాలని తనకు ఎలాంటి సూచనలూ లేవని జూనియర్ న్యాయవాది తెలిపారు. దీంతో ధర్మాసనం "అడ్వొకేట్ ఆన్ రికార్డ్‌ను పిలవండి. మా ముందు హాజరుకమ్మని ఆదేశించండి" అని తెలిపింది. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అడ్వొకేట్ ఆన్ రికార్డ్ హాజరయ్యారు. ధర్మాసనానికి క్షమాపణలు చెప్పారు. ఏ పత్రాలు లేకుండా.. కేసుకు సంబంధించిన పరిజ్ఞానం లేకుండా జూనియర్ న్యాయవాదిని ఎందుకు పంపారని ఆయనను న్యాయమూర్తులు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్‌కు రూ.2 వేలు చెల్లించాలని ధర్మాసనం ఆదేశించింది.

జాతీయ విపత్తుగా హిమాచల్ వరదలు

మోదీకి ప్రియాంకగాంధీ లేఖ

న్యూఢిల్లీ: హిమాచల్‌ప్రదేశ్‌లో ఘోర విపత్తు సంభవించిందని, దీనిని 2013 నాటి కేదార్‌నాథ్ దుర్ఘటన మాదిరిగా జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధాని నరేంద్రమోదీకి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా శుక్రవారం విజ్ఞప్తి చేశారు. బాధితులకు సహాయ, పునరావాసం, రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించాలని కోరుతూ ప్రియాంక లేఖ రాశారు. రాష్ట్రంలో జులై 14, 15 తేదీల్లో సంభవించిన వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనలతో కుల్లు, మండి జిల్లాల్లో భారీ విధ్వంసం జరిగిందని తెలిపారు. ప్రియాంక ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. హిమాచల్‌లో సాధారణ, కష్టపడి పనిచేసే ప్రజలు ఉన్నారన్నారు. రాష్ట్రానికి చెందిన మహిళలు, రైతులు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, యువత ఆత్మాభిమానం గలవారు...కష్టజీవులని, అలాంటి ప్రజలు ఇప్పుడు ఊహించని విధంగా తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నారని ప్రియాంకగాంధీ వివరించారు. వరదులు, కొండచరియలు విరిగిపడటంతో రాష్ట్రంలో పెద్దఎత్తున విధ్వంసం జరిగిందని తెలిపారు. సిమ్లా, కుల్లు, మనాలి, మండిలో విపత్తు బాధితులను ఇటీవల తాను కలిశానని, రాష్ట్రంలో జరిగిన విధ్వంసం చూస్తే కడుపుతరుక్కు పోతోందన్నారు. ఈ విపత్తుకు ఇప్పటి వరకు 428 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. చాలామంది కుటుంబ సభ్యులను పోగొట్టుకున్నారని, మృతుల్లో చిన్నారులు సైతం ఉన్నారని ప్రియాంక గుర్తుచేశారు. 16 వేలకు పైగా పశువులు, పక్షులు మృతిచెందాయన్నారు. 13 వేళ ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా ధ్వంసమయ్యాయని వివరించారు.

వైద్య విద్యకు మహర్దశ

- ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రారంభం
- అధునాతన సదుపాయాలతో నిర్మాణం
- ఉన్నతంగా ఎదగాలని సీఎం జగన్ ఆకాంక్ష

విశాలాంధ్ర-విజయనగరం: రాష్ట్రంలో వైద్యవిద్యకు మహర్దశ వచ్చిందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. పెరిగిన వైద్య కళాశాలల ద్వారా అందుబాటులోకి వచ్చిన చదువు, శిక్షణ, సేవతో విద్యార్థులు మంచి వైద్యులుగా ఎదగాలని సీఎం జగన్ ఆకాంక్షించారు. విజయనగరం ప్రభుత్వ వైద్య కళాశాలతో పాటు రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలను సీఎం జగన్ శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జగన్ మాట్లాడుతూ కొత్తగా ప్రారంభించిన విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలల్లో మొదటి సంవత్సరం ప్రవేశాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో వైద్య కళాశాల ఏర్పాటు చేయడమే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. స్వాతంత్ర్యం అనంతరం రాష్ట్రంలో 11 వైద్యకళాశాలలు మాత్రమే ఉన్నాయని, తాము అధికారం చేపట్టిన తర్వాత 17 వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలని సంకల్పించామన్నారు. అందులో ఐదు కాలేజీలను ఇప్పుడు ప్రారంభించామని, వీటి వల్ల అదనంగా 750 మెడికల్ సీట్లు వచ్చాయన్నారు. వీటితో కలిపి ఇప్పటి వరకు 2185 సీట్లు ఉంటే 17 కళాశాలలు పూర్తయితే సీట్ల సంఖ్య 4735కు పెరుగుతాయని జగన్ చెప్పారు. ఇప్పటికే ఉన్న వైద్యకళాశాలల్లో మెరుగైన సదుపాయాలు కల్పించామన్నారు.

వెనుకబడిన ప్రాంతాలైన పార్వతీపురం, నర్సీపట్నంలోనూ వైద్య కళాశాలలు శరవేగంగా నిర్మాణం జరుగుతున్నా యని సీఎం జగన్ చెప్పారు. వైద్య కళాశాలలతో పాటు ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు అభివృద్ధి చేస్తున్నామన్నారు. వైద్య రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్రంలో 10,032 విలేజ్ క్లినిక్‌లు, వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఆసుపత్రుల్లో 105 రకాల మందులు,14 రకాల టెస్టులు చేస్తున్నట్లు చెప్పారు. 108, 104 సేవలతో పాటు రాష్ట్రంలో 2204 అంబులెన్స్‌లు పనిచేస్తున్నాయన్నారు. వైద్య రంగంలో 53,126 మంది వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. విజయనగరం కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ వైద్య కళాశాలను విజయనగరం జిల్లాకు మణిహారంగా అభివర్ణిం చారు. మెరుగైన వైద్య సేవలకు కళాశాల ఉపయోగపడు తుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న వైద్య కళాశాలల్లో అత్యాధునిక విద్య, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐదు కొత్త ప్రభుత్వ కళాశాలల్లో చేరిన మొదటి సంవత్సరం వైద్య విద్యార్థుల తోను, తిరుపతిలోని ఎస్‌వీ మెడికల్ కాలేజి, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల పీజీ విద్యార్థులతో ముఖ్యమంత్రి వర్చువల్‌గా ముఖాముఖి నిర్వహించారు. అనంతరం వైద్య విద్యార్థులతో ముఖ్యమంత్రి గ్రూప్ ఫోటోలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రులు బూడి ముత్యాల నాయుడు, పి.రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారా యణ, విడదల రజని, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, వైద్య విద్యాశాఖ డైరెక్టర్ డీజీవీఎల్ నరసింహం, వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ మురళీధర్‌రెడ్డి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.పద్మలీల, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎస్. అప్పలనాయుడు, జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్‌లు పాల్గొన్నారు.

నివేదిక ఇవ్వడం నేరమెలా?

ఎడిటర్స్ గిల్డ్ కేసులో సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ: ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా(ఈజీఐ) కమిటీ సభ్యులపై మణిపూర్ పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌లో రెండు వర్గాల్లో శత్రుత్వాన్ని ప్రోత్సహించేదిగా ఏమీ కనిపించడం లేదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈజీఐ కమిటీ నివేదిక అంశానికి సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కీలక వ్యాఖ్యలు చేసింది. కమిటీలోని సభ్యులపై మణిపూర్ పోలీసులు దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను ప్రస్తావించిన సుప్రీం ధర్మాసనం... రెండువర్గాల్లో శత్రుత్వాన్ని ప్రోత్సహించేదిగా ఏమీ కనిపించడం లేదని తెలిపింది. నివేదిక ఇవ్వడాన్నే నేరంగా ఎలా పరిగణిస్తారని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఈజీఐ కమిటీ సభ్యులపై చర్యలు తీసుకోకుండా ఇచ్చిన రక్షణను మరో రెండు వారాలు పొడిగించింది. అంతేకాకుండా ఎఫ్ఐఆర్‌ను ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ఫిర్యాదుదారుడి స్పందనను కోరింది. ఎడిటర్స్ గిల్డ్‌కు సంబంధించిన కేసును సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం నేడు మరోసారి విచారించింది. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు వాస్తవంలో కనిపించడం లేదని, క్షేత్రస్థాయిలో పర్యటించిన తర్వాతే నిజనిర్ధారణ కమిటీ నివేదిక ఇచ్చిందని, కానీ వారిచ్చిన నివేదిక పక్షపాతంగా ఉందని ప్రభుత్వం చెబుతోందని, అది నిజమా, కాదా అనే విషయం పక్కనపెడితే.. ఇది భావ ప్రకటన స్వేచ్ఛ కదా' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి ధర్మాసనం పేర్కొంది. అందువల్ల వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకుండా మరో రెండు వారాలు రక్షణ కల్పిస్తూ ఆదేశాలిచ్చింది. మణిపూర్‌లో హింస సందర్భంగా ఆ రాష్ట్రంలోని ప్రచారసాధనాలు అనుసరించిన వైఖరిపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా నిజనిర్ధారణ కమిటీని వేసింది. హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న ప్రాంతాల్లో ఆగస్టు 7 నుంచి 10 తేదీల్లో పర్యటించిన నలుగురు సభ్యుల బృందం... ఓ నివేదిక విడుదల చేసింది. అయితే ఈ నివేదిక ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని మణిపూర్‌కు చెందిన మాజీ ఇంజినీర్, మరో వ్యక్తి వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. వాటిపై మణిపూర్ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను కొట్టివేయాలని కోరుతూ ఈజీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో గత నెలలో విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు... తొలుత సెప్టెంబర్ 15 వరకు రక్షణ కల్పించగా, తాజాగా మరోసారి పొడిగించింది.

నిర్బంధం తీవ్రమైతే తిరుగుబాటు ఉధృతం

- విద్యార్థులపై పోలీస్ జులుం దుర్మార్గం
- చంద్రబాబుకు జరిగిన అన్యాయం వివరించేందుకే ఢిల్లీ వచ్చా
- జాతీయ మీడియాతో టీడీపీ నేత నారా లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడలో విద్యార్థులపై పోలీసుల జులుం ప్రదర్శించడం దుర్మార్గమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. "చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేయాలనుకున్న విజయవాడలోని వివిధ కళాశాలల విద్యార్థులపై పోలీసులు జులుం ప్రదర్శించడం, కళాశాలల్లోకి పెద్దఎత్తున పోలీసులు చొరబడటం ఎమర్జెన్సీని తలపిస్తోంది. తరగతులు సస్పెండ్ చేయించి, కళాశాలలకు పోలీసులే సెలవు ప్రకటించడం వెనుక సైకో జగన్ సర్కారు ఆదేశాలే కారణం. నిర్బంధం తీవ్రమైతే తిరుగుబాటు ఉధృతం అవుతుందని గుర్తుంచుకోండి సైకో పాలకులారా" అని లోకేశ్ ట్వీట్ చేశారు. ఇక ఢిల్లీ వెళ్లిన లోకేశ్ జాతీయ మీడియాతో మాట్లాడుతూ... చంద్రబాబుకు జరిగిన అన్యాయం గురించి చెప్పేందుకే దేశ రాజధానికి వచ్చినట్టు తెలిపారు. "అవినీతి పరులు నీతిపరులను జైలుకు పంపుతున్నారు. 'స్కిల్ డెవలప్‌మెంట్' అంశంలో ఎలాంటి స్కామ్ జరగలేదని నేను నిరూపించగలను. అన్ని పత్రాలు చూపించి అవినీతి జరగలేదని నిరూపిస్తా. అపరిమిత అధికారం అపరిమిత అవినీతికి దారి తీస్తుందని లోకేశ్ ధ్వజమెత్తారు.ఏపీ ప్రభుత్వం కావాలనే చంద్రబాబును తప్పుడు కేసులో ఇరికించింది. ఎలాంటి కుంభకోణం జరగలేదని నేను నిరూపించగలను" అని సవాల్ విసిరారు. అన్ని పత్రాలు చూపించి అవినీతి జరగలేదని నిరూపిస్తా అని స్పష్టం చేశారు. చంద్రబాబుకు గానీ, మాకు గానీ ఎలాంటి డబ్బు అందినట్టు, మా ఖాతాల్లోకి నగదు బదిలీ అయినట్టు సీఐడీ వాళ్లు ఏమైనా నిరూపించగలిగారా? అని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో మేం ఎలాంటి తప్పిదానికి పాల్పడలేదని దీన్నిబట్టే అర్థమవుతోందని లోకేశ్ వివరించారు. న్యాయం జరగడం కొద్దిగా ఆలస్యం కావచ్చేమో కానీ, చంద్రబాబు కడిగిన ముత్యంలా బయటికొస్తారని ధీమా వ్యక్తం చేశారు.

రాజకీయ పార్టీ ఆఫీసుల నిర్బంధం అవసరమా..?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా బాధితులు విజయవాడ నగరానికి వస్తుంటే రైల్వే, బస్ స్టేషన్ల వద్ద పోలీసులు అడ్డుకోవటం ప్రభుత్వ పిచ్చి పరాకాష్ట కాదా ..? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రశ్నించారు. అగ్రిగోల్డ్ బాధితులకు అండగా శుక్రవారం దాసరి భవన్ వద్ద అఖిలపక్షం విలేకరులతో మాట్లాడింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తోందని, అగ్రిగోల్డ్ బాధితులను నిర్బంధించడమే అందుకు ఉదాహరణ అని తెలిపారు. నాడు ప్రతిపక్షనేతగా జగన్‌మోహన్ రెడ్డి అన్ని రాజ కీయ పార్టీలతో కలిసి అగ్రిగోల్డ్ బాధితులకు అండగా మాట్లాడుతూ అధికారంలోకి వస్తే వారం రోజుల్లో సమస్యలన్నీ పరిష్కరిస్తానని ఇచ్చిన మాట తప్పారన్నారు. ప్రభుత్వానికి బాధితుల సమస్యలు విజ్ఞాపన రూపంలో కోరడానికి కార్యక్రమం కోసం జింఖానా గ్రౌండ్‌లో అనుమతి కోరగా ప్రభుత్వం అనుమతించలేదు. కనీసం ధర్నాచౌక్ వద్ద కూడా అనుమతించలేదు. 26 జిల్లాల నుంచి హాల్ మీటింగ్ కోసం వస్తుంటే ముందస్తు అరెస్టులు, నోటీసులు ఇచ్చి గృహనిర్బంధం చేయటం అవసరమా? ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఏ ప్రజాసంఘాలను, ప్రతిపక్ష పార్టీలను నిరసన కార్యక్రమాలకు అనుమతించకుండా రాక్షస పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో విద్యుత్ ఉద్యోగుల నిరసన కార్యక్రమానికి వస్తే ఆధార్, సెల్ ఫోన్ నెంబర్లు ఇవ్వమని అడగటం దుర్మార్గం అన్నారు. బాధితులకు అండగా నిలిచిన ముప్పాళ్ల నాగేశ్వరరావుని అరెస్టు చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు.

పీసీసీ ప్రధాన కార్యదర్శి తులసి రెడ్డి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల నిర్బంధం అప్రజాస్వామికమన్నారు. ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమన్నారు. ఆంధ్ర మేధావుల ఫోరం అధ్యక్షులు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితుల ఆవేదనను అర్థం చేసుకోకుండా పోలీసులు బాధితులను అరెస్టు చేయటం అన్యాయం అన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవడంలో జగన్ విఫలమయ్యారు అన్నారు. పేదల ప్రభుత్వమని చెప్పి హామీలను తుంగలో తొక్కి బాధితులకు అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో పౌర హక్కుల కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు అండగా ఉండాల్సిన పోలీస్ యంత్రాంగం రాజకీయ కార్యాలయాల వద్ద భారీగేట్లు పెట్టి బరితెగించడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా పోలీసులు సహకరించి బాధితులకు అండగా ఉండాలని హితవు పలికారు. లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు బాబ్జి మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల పట్ల పోలీసుల తీరు విచిత్రంగా ఉందని, ప్రజాస్వామ్య వ్యవస్థ దిగజారిందని అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, అగ్రిగోల్డ్ కస్టమర్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి తిరుపతిరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

50 గంటలకు పైగా కశ్మీర్ ఎన్‌కౌంటర్

మరో సైనికుడి మృతి... ఇద్దరికి గాయాలు

శ్రీనగర్: జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లాలో మొదలైన ఎన్‌కౌంటర్ 50 గంటలకు పైగా కొనసాగుతోంది. ఉగ్రవాదులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో సైనికుడు మృతి చెందాడు. ఇద్దరు గాయపడ్డారు. కోకెర్‌నాగ్ లోని దట్టమైన అడవుల్లో ఉగ్రవాదులను వేటాడేందుకు సైన్యం, పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించిన తర్వాత బుధవారం తెల్లవారుజామున కాల్పులు జరిగాయి. సైన్యానికి చెందిన ఇద్దరు, ఒక పోలీసు సహా ముగ్గురు అధికారులు మరణించారు. అయితే ఉగ్రవాదుల పక్షాన మరణించిన వారి సంఖ్యపై ఎలాంటి ధ్రువీకరణ లేదు. భద్రతా బలగాలు తమ తీవ్రతరం చేసిన ఉగ్రవాద వ్యతిరేక కార్యకలా పాలలో కొత్త తరం ఆయుధాలు, దాడి సామర్థ్యం గల హెరాన్ డ్రోన్‌లతో సహా పరికరాలను ఉపయోగిస్తున్నాయి. సెప్టెంబరు 12-13 రాత్రి సైన్యం, జమ్ముకశ్మీర్ పోలీసులు తమ ఉమ్మడి శోధన ఆపరేషన్‌ను ప్రారంభించారు. గారోల్ గ్రామంలో కొందరు ఉగ్రవాదుల కోసం వారు గాలింపు చర్యలు చేపట్టారని అధికారులు తెలిపారు. విస్తృతమైన అన్వేషణలో ఉగ్రవాదులు దట్టమైన అడవిలోని ఎత్తయిన ప్రాంతాలలో దాగి ఉన్నారని నిర్ధారించారు. ఈ శోధన దళానికి నాయకత్వం వహించిన కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, మేజర్ ఆశిష్ ధోన్‌చక్‌తో కలిసి ప్రవేశించినవారు అడవులలోని కఠినమైన భూభాగాల గుండా వెళ్లారు. బుధవారం ఉదయం ఉగ్రవాదుల కోసం గాలింపు చేపట్టిన సమయంలో వారు అధికారులను లక్ష్యంగా చేసుకొని దాడి చేశారు. కల్నల్ సింగ్, మేజర్ ధోంచక్, డీఎస్పీ హిమాన్యున్ భట్ భీకర ఎన్‌కౌంటర్‌లో తుపాకీ కాల్పులకు గురై గాయాల కారణంగా మరణించారు.

వీరు ధైర్యవంతులు

19 రాష్ట్రీయ రైఫిల్స్ యూనిట్ (19 ఆర్ఆర్) కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ మన్‌ప్రీత్ సింగ్, సేన మెడల్ (గ్యాలంట్రీ), 19 ఆర్ఆర్ కంపెనీ కమాండర్ మేజర్ ఆశిష్ ధోంచక్, సేన మెడల్ (గ్యాలంట్రీ), జమ్ముకశ్మీర్ పోలీసు డిప్యూటీ సూపరింటెండెంట్ హిమాన్యున్ ముజామిల్ భట్ ఉన్నారు. కాగా, లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా గురువారం శ్రీనగర్‌లో సైనికాధికారులకు నివాళులర్పించారు. అధికారుల మృతదేహాలను వెలికితీసేందుకు కోకెర్‌నాగ్‌లోని ప్రమాదకరమైన భూభాగంలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించినట్లు సైన్యం తెలిపింది.

విద్య కాషాయీకరణే కేంద్రం లక్ష్యం

- ముఖ్యమంత్రి జగన్ వత్తాసు
- ఉద్యమాలతో ప్రతిఘటిద్దాం: దినేశ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: విద్య కాషాయీకరణే మోదీ సర్కారు లక్ష్యమని, అందుకు ఏపీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యదర్శి దినేశ్ కుమార్ విమర్శించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నిర్మాణ మహాసభలను నెల్లూరులో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దినేశ్‌కుమార్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్‌కు ఆంధ్రప్రదేశ్ అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర నిర్మాణ మహాసభలు ఇక్కడ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఒకేదేశం-ఒకే చట్టం- ఒకే విద్యావిధానం పేరుతో మోదీ ప్రభుత్వం విద్యావ్యవస్థను సర్వనాశనం చేస్తోందని ఆయన విమర్శించారు. మోదీ సర్కారు అమలు చేస్తున్న విద్యావిధానంపై అలుపెరగని పోరాటాలు చేయాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. ఈనెల 28 నుంచి అక్టోబర్ ఒకటో తేదీ వరకు బీహార్‌లో జరిగే ఏఐఎస్ఎఫ్ జాతీయ మహాసభలలో చర్చించి పోరాటాలకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తామని ప్రకటించారు. సనాతన ధర్మం పేరుతో లౌకికవాదాన్ని రూపుమాపేందుకు బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని ఆయన మండిపడ్డారు. మోదీ అధికారం చేపట్టిన తర్వాత గవర్నరు వ్యవస్థను అడ్డుపెట్టుకొని విపక్ష ప్రభుత్వాల కూల్చివేతను నిరాటంకంగా సాగిస్తున్నారని దినేశ్‌కుమార్ విమర్శించారు. రాజ్యాంగానికి అడుగడుగునా తూట్లు పొడుస్తున్నారని చెప్పారు. గవర్నర్లు బీజేపీకి రబ్బర్ స్టాంపులుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. చాన్సలర్ల హోదాలో యూనివర్సిటీల కార్యకలాపాల్లో గవర్నర్లు తలదూరుస్తున్నారని ఆరోపించారు. మోదీ పాలనలో విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమవుతోందని, శాస్త్రీయ విద్యావిధా నాన్ని నామరూపాలు లేకుండా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తున్నదని, దీనిపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన విజ్ఞప్తి చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని, దానిని సమర్థించే పార్టీలను ఓడించడమే లక్ష్యంగా పనిచేయా లని కోరారు. జమిలి ఎన్నికల కోసం మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి రంగన్న మాట్లాడుతూ విద్య కాషాయీకరణకు కొన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలే వ్యతిరేకిస్తున్నాయని చెప్పారు. కానీ ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రం బీజేపీ విద్యావిధానాన్ని నిర్లజ్జగా అమలు చేస్తున్నారని విమర్శించారు. తన స్వప్రయోజనాల కోసం జగన్ రాష్ట్రాన్ని, రాష్ట్ర ప్రజలను ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు. మోదీ సర్కారు ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని పాఠ్యాంశాలుగా మారుస్తోందని, దేశం కోసం పోరాడిన త్యాగమూర్తుల చరిత్రను చెరిపేస్తోందన్నారు. తొలుత విద్యార్థి సంఘం పతాకాన్ని ఏఐఎస్ఎఫ్ నెల్లూరు జిల్లా మాజీ కార్యదర్శి ఎగురవేశారు. మృతవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, నవ్య, రాజశేఖర్, బాషా అధ్యక్షవర్గంగా వ్యవహరించగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, నెల్లూరు జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్, శ్రీరాములు, అప్పలస్వామి, నాగభూషణం, ఫణీంద్ర, ఏఐఎస్ఎఫ్ మాజీ నేత మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పాల్గొన్నారు.

ఇప్పట్లో భారత్, పాక్ ద్వైపాక్షిక సిరీస్‌లు ఉండవు

స్పష్టం చేసిన క్రీడామంత్రి అనురాగ్ ఠాకూర్

న్యూఢిల్లీ: భారత్-పాక్ క్రికెట్ జట్ల మధ్య భవిష్యత్తులో ద్వైపాక్షిక సిరీస్‌లు జరిగే అవకాశం లేదని కేంద్ర క్రీడలశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ స్పష్టం చేశారు. దేశ ప్రజల మనోభావాలకు అనుగుణంగా నడుచుకోవాల్సి ఉంటుందన్నారు. రాజస్థాన్‌లోని ఉదయపూర్ విలేకరులతో మాట్లాడిన ఠాకూర్... సీమాంతర ఉగ్రవాదాన్ని అరికట్టకపోతే పాకిస్తాన్ తో భారత్ ఎలాంటి ద్వైపాక్షిక క్రికెట్ మ్యాచులు ఆడదు. పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలను పునరుద్ధరించ కూడదు. ఈమేరకు బీసీసీఐ ముందే నిర్ణయం తీసుకుంది' అని చెప్పారు. ఇదే విషయంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మీడియాతో మాట్లా డుతూ... పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక సిరీస్ ఉండదని స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి మనదగ్గర స్పష్టమైన విధానముందన్నారు. ఇదే సమయంలో ఉగ్రమూకలపై కఠినంగా వ్యవహరించాలని రాజీవ్ శుక్లా డిమాండ్ చేశారు. ఇక శ్రీలంకపై ఓటమితో ఆసియా కప్ నుంచి పాకిస్తాన్ నిష్క్రమించింది. మరోవైపు... అక్టోబరులో జరగనున్న వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా అక్టోబరు 14న పాక్‌తో భారత్ తలపడనుంది. ఉగ్రవాదాన్ని అరికట్టే వరకు పాకిస్తాన్‌తో ఎలాంటి ద్వైపాక్షిక మ్యాచ్‌లు ఆడబోమని బీసీసీఐ చాలా కాలం క్రితమే నిర్ణయించుకుంది. సరిహద్దుల గుండా దాడులు లేదా చొరబాట్లను ఆపితే తప్ప పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను పునరుద్ధరించబోమని తెలియజేసారు. ఇటీవలే జమ్మూ కశ్మీర్‌లో పాకిస్తాన్‌కు చెందిన కొందరు టెర్రరిస్టులు దాడి చేయగా.. ముగ్గురు ఆర్మీ అధికారులు వీరమరణం పొందారు.ఈ వార్త విన్న చాలా మంది అభిమానులు ఆగ్రహంతో ఊగిపోయారు. అసలు పాకిస్తాన్‌తో క్రికెట్ ఆడటమే మానేయాలని, ద్వైపాక్షిక సిరీసులే కాకుండా ఆసియా కప్ వంటి మల్టీ నేషనల్ టోర్నీల్లో కూడా పాక్‌తో ఆడకూడదని డిమాండ్ చేశారు.

మ్యాక్స్‌వెల్‌కు పుత్రోత్సాహం

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా జట్టు స్టార్ బ్యాటర్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తున్న మ్యాక్స్‌వెల్ తండ్రి అయ్యాడు. భారత సంతతి అమ్మాయిని పెళ్లి చేసుకున్న మ్యాక్సీకి ఇప్పుడు ఓ కొడుకు పుట్టాడు. ఈ సందర్భంగా ఈ విషయాన్ని తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా మ్యాక్స్‌వెల్ షేర్ చేసుకున్నాడు. తాజాగా మ్యాక్సీ-వినీలు తమ అబ్బాయికి 'లొగాన్ మావెరిక్ మ్యాక్స్‌వెల్' అని నామకరణం చేశారు. ఈ పోస్టుకు బాలీవుడ్ నటి, విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మతో పాటు యుజ్వేంద్ర చాహల్ భార్య ధనశ్రీతో పాటు అనేకమంది సెలబ్రిటీలు శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్ని టీవీలు పగిలాయో...

లంకపై ఓడిపోయిన పాక్ జట్టుపై అభిమానుల ట్రోలింగ్



న్యూఢిల్లీ: ఆసియా కప్ 2023లో ఫైనల్ చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో పాకిస్తాన్ జట్టు ఓటమి పాలైంది. కొలంబో వేదికగా గురువారం శ్రీలంకతో జరిగిన ఉత్కంఠ మ్యాచులో రెండు వికెట్ల తేడాతో ఓడిపోయింది. దీంతో ఆ జట్టు ఫైనల్ చేరకుండానే నిష్క్రమించింది. శ్రీలంక 11వ సారి ఆసియా కప్ ఫైనల్ కు చేరింది. కప్పు కోసం శ్రీలంక ఆదివారం భారత జట్టుతో అమీతుమీ తేల్చుకోనుంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ ఆది నుంచే తడబడింది. మహ్మద్ రిజ్వాన్ (86 నాటౌట్), ఇఫ్తికర్ అహ్మద్ (47)లు 108 పరుగుల భాగస్వామ్యంతో రాణించడంతో 42 ఓవర్లకు 7 వికెట్ల నష్టానికి పాక్ 252 పరుగులు చేసింది. వర్షం వల్ల మ్యాచ్‌ను 42 ఓవర్లకు కుదించారు. కుశాల్ మెండిస్ (91), చరిత్ అసలంక (49 నాటౌట్), సదీర సమరవిక్రమ (48) లు రాణించడంతో ఎనిమిది వికెట్లు కోల్పోయిన శ్రీలంక ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. శ్రీలంక పై ఓడిపోయి ఫైనల్ చేరడంలో విఫలమైన పాక్ పై సొంత అభిమానులతో పాటు నెటిజన్లు ట్రోలింగ్ చేస్తున్నారు. టీవీలు పగలడం స్టార్ట్ అయ్యింది. ఇప్పటి వరకు ఎన్ని టీవీలు పగిలిపోయాయో అని ఓ నెటిజన్ చేసిన వ్యాఖ్య వైరల్‌గా మారింది. కొలంబోలో ఒక థ్రిల్లర్. ఆసియా కప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించింది. కానీ దహానీకి పెద్ద ఉపశమనం, అతను అన్‌ప్యాక్ చేయవలసిన అవసరం లేదు అని మరో నెటిజన్ ట్వీట్ చేశాడు.

ఆదిత్య ఎల్-1 నాలుగో భూకక్ష్య పెంపు విజయవంతం

న్యూఢిల్లీ: సూర్యుడిపై పరిశోధనలకు ఇస్రో ప్రయోగించిన ఆదిత్య ఎల్-1 మరో అడుగు ముందుకు వేసింది. ఇందులో భాగంగా ఆదిత్య ఎల్-1 ఉపగ్రహానికి నాలుగోసారి భూకక్ష్య పెంపు విన్యాసాన్ని ఇస్రో విజయవంతంగా చేపట్టింది. బెంగళూరులోని టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ ద్వారా ఈ ఆపరేషన్‌ను ఇస్రో నిర్వ హించింది. మారిషస్, పోర్ట్ బ్లెయిర్‌లోని ఇస్రో గ్రౌండ్ స్టేషన్లు ఈ ప్రక్రియను పర్య వేక్షించాయి. ఆదిత్య ఎల్-1 ఉపగ్రహానికి నాలుగోసారిభూకక్ష్య పెంపు విన్యాసంతో ఉపగ్రహం 256 కి.మీ.× 121973 కి.మీ కక్ష్యలోకి ప్రవేశిం చిందని ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. తదుపరి కక్ష్య పెంపు విన్యా సాన్ని సెప్టెంబర్ 19వ తేదీన చేపట్టనున్నట్లు వెల్లడించారు. 15 లక్షల కిలోమీటర్ల దూరంలోని ఎల్-1 పాయింట్‌ను చేరుకోవాలంటే ఆదిత్య ఎల్-1కు నాలుగు నెలలు పడుతుందని వివరించారు. సూర్యుడి రహస్యాలను తెలుసుకోవడానికి ఇస్రో సెప్టెంబర్ 2 న ఆదిత్య ఎల్-1 అంతరిక్ష నౌకను విజయవంతంగా ప్రయోగించింది. ఇది నాలుగు నెలలు ప్రయాణించి భూమి, సూర్యుని మధ్య ఉన్న లాంగ్రెస్ పాయింట్ ఎల్1కి వెళ్తుంది. ఇప్పటి వరకు ఆదిత్య ఎల్ 1 భూమి చుట్టూ నాలుగు కక్ష్యలను పూర్తి చేసింది. ఆదిత్య ఎల్ 1 భూమి నాల్గవ కక్ష్యలోకి ఇంజెక్ట్ చేయబడింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.